ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శుక్రవారం 5 జూలై 2024


రోడ్డుపై విధులు నిర్వర్తిస్తున్న వార్డ్ ఆఫీసర్

పని పరిధి లేదు..

అగమ్యగోచరంగా వార్డు ఆఫీసర్ల పరిస్థితి

వరంగల్ కార్పొరేషన్, జూలై 4: రెవెన్యూశాఖలో వీఆర్ఏ, వీఆర్‌వోలుగా పనిచేసి మునిసిపల్ శాఖలో విలీనమైన ఉద్యోగుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. ఎంతో ఆర్భాటంగా శాఖలోకి తీసుకున్న ప్రభుత్వం.. వారికి కనీస విధులు, కార్యాలయాలు కేటాయించడంలో ఉదాసీనత ప్రదర్శిస్తోంది. ముఖ్యంగా గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో కేటగిరి 6 కింద 38 మంది రెవెన్యూ ఉద్యోగులను ప్రభుత్వం వార్డు ఆఫీసర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ బల్దియాకు వచ్చిన మాజీ రెవెన్యూ అధికారులు ఇక్కడి పరిస్థితి చూసి కంగుతున్నారు. వారికి నేటికీ ఒక చిరునామా అనేది లేక డివిజన్‌లలో తెగిన గాలిపటాల్లా తిరుగుతున్నారు. వరంగల్ బల్దియాకు అనుసంధానంగా పనిచేసే సిబ్బందికి వార్డు ఆఫీసులు లేకపోవడంతో చెట్ల కూర్చుని విధులు నిర్వర్తించవలసిన దుస్థితి దాపురించింది. అంతే కాకుండా కనీసం బల్దియా పరిధిలో పని చేస్తున్నట్టు వీరికి గుర్తింపు కార్డులు కూడా లేకపోవడంతో డివిజన్‌లలో పని చేయడానికి వెళ్లిన సందర్భంలో ప్రజలు అనుమానిస్తూ స్పందించడం లేదు. కొందరు డివిజన్‌లో అనుమానితులు సంచరిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటనలున్నాయి. విలీన గ్రామాల్లోనైతే కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు.

వార్డు ఆఫీసర్లుగా..

బల్దియా పరిధిలో 38 మంది వీఆర్ఏలతో పాటు మరో 32 మంది ప్రభుత్వ ఉద్యోగులను కలుపుకుని 70 మందిని ఇటీవల వార్డు ఆఫీసర్లుగా నియమించారు. నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికీ వారు ఏ పని చేయాలో తెలియని గందరగోళ పరిస్థితి ఉంది. ప్రభుత్వం వార్డు ఆఫీసర్లుగా నియమించినా గ్రేటర్ వరంగల్ పరిధిలో 66 డివిజన్‌లలో వారు స్థానికంగా ఉండి పనిచేసేందుకు ఎక్కడా ప్రత్యేక కార్యాలయం గానీ ప్రత్యేక గదులు గానీ కేటాయించలేవు. 66 మందిని 66 డివిజన్‌లకు వార్డు ఆఫీసర్లుగా మరో నలుగురిని బల్దియా మీసేవా కేంద్రాలలో పనిచేసేందుకు నియమించినా కచ్చితమైన పని విధానం కేటాయించలేదు. వీరు ఏ పని చేయాలలో, ఎటువెళ్లాలో సంబంధిత అధికారులు ఆదేశించకపోవడంపై ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. ఇటీ వల వరంగల్ పర్యటన సందర్భంగా హైదరాబాద్ ఇన్‌చార్జి సీడీఎంఏ వీపీ గౌతం సైతం వార్డ్ అధికారుల విధుల కేటా యింపు నిర్లక్ష్యంపై ఇక్కడి అధికారులను మందిలించినట్టు విశ్వసనీయ సమాచారం. నూతనంగా వార్డు ఆఫీసర్లుగా నియమించిన వారికి వెంటనే ఆయా డివిజన్‌లలో పూర్తి స్థాయి విధులు కేటాయించాలని గౌతం ఆదేశించినట్టు తెలిసింది.



కార్యాలయాలు కేటాయిస్తే ప్రయోజనాలు

వార్డు అధికారులకు డివిజన్‌లో ఒక ప్రత్యేక కార్యాలయాన్ని కేటాయించి ప్రభుత్వం నుంచి కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాబ్‌లు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికీ బల్దియా ఐటీ విభాగం నుంచి లాగిన్ కేటాయించలేదు. దీంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పన్నులు, పెన్షన్లు, గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్, 200 యూనిట్ల సబ్సిడీ కరెంటుకు సంబంధించిన దరఖాస్తులతో బల్దియా ప్రధాన కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాలకు ప్రజలు క్యూ కడుతున్నారు. కొత్తగా నియ మించబడ్డ వార్డు అధికారులకు బల్దియా లాగిన్ కేటాయించి ప్రభుత్వం కేటాయించిన 16 పనులు చేయించడంతో అధికారుల పని సులువుగా మారుతుంది. ప్రజలు స్థానికంగా ఉన్న సమస్యలపై ఫిర్యాదులు చేస్తే బల్దియా లాగిన్ ద్వారా అధికారులకు తెలియజేస్తామని అంటున్నారు.

- బల్దియాకు 38 మంది రెవెన్యూ సిబ్బంది కేటాయింపు
- వార్డు ఆఫీసర్లుగా పోస్టింగ్ ఇచ్చినా పని లేని పరిస్థితి
- నెల రోజుల గడిచినా అదే గందరగోళం
- డ్యూటీలు కేటాయించాలని సిబ్బంది గగ్గోలు

జాబ్‌చార్ట్ ఏదీ?

రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో పని చేస్తున్న వీఆర్ఏలు, వీఆర్ఏలకు వివిధ ప్రభుత్వ విభాగాలతో పాటు మున్సిపాలిటీలలో విధులు కేటాయించాలని అప్పటి ప్రభుత్వం 2023 జనవరి మాసంలో ప్రత్యేక జీవోను జారీ చేసింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 38 మందిని కేటాయించింది. అప్పటి నుంచి వారు బల్దియా పరిధిలో ఎన్నికల విధులతో పాటు ట్రైనింగ్, పేపర్ వర్క్ స్పోర్ట్స్ వింగ్‌లలో పని చేస్తున్నారు. 2024 జనవరి 24న అప్పటి కమిషనర్ రిజ్వాన్ భాషా షరీఫ్ ఒక్కో డివిజన్‌కు ఒక అధికారి చొప్పున 66 డివిజన్‌లకు 66 మందితోపాటు 4 బల్దియా మీ సేవా కేంద్రాలలో పని చేసేందుకు మరో నలుగురిని నియమిస్తూ జాబితాను సిద్ధం చేశారు. ఈ యేడు మే 31న వార్డుల వారిగా ఆఫీసర్లను కేటాయిస్తూ బల్దియా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 1 నుంచి వార్డు ఆఫీసర్లుగా పని చేస్తున్నవారికి విధులపై ఇప్పటికీ ఒక స్పష్టత లేదు. జాబ్‌చార్ట్ ఇంప్లిమెంటేషన్ చేయడంలో కమిషనర్‌తోపాటు అధికారులు జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఇంటింటికీ డిమాండ్ నోటీసులు పంచడానికే పరిమితమయ్యామా? అని ప్రశ్నిస్తున్నారు. ఒక్కో డివిజన్‌లో ప్రస్తుతం పని చేస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రత్యేక గదులను కేటాయించాలంటున్నారు. అంతే కాకుండా మున్సిపల్ డైరెక్టర్ ఆఫ్ కమిషన్ ఆదేశాల మేరకు జాబ్ ఆర్డర్‌లో సూచించిన 16 రకాల పనులు తమకే అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.

వార్డు అధికారులు కేటాయించిన పనులు

- శానిటేషన్ మాస్టర్స్, పీహెచ్ వర్కర్ల పనుల పర్యవేక్షణ
- ఉదయం, సాయంత్రం పీహెచ్ వర్కర్ల హాజరు పర్యవేక్షణ
- వార్డ్ లేవల్ శానిటేషన్ ప్లాన్, చెత్త సేకరణ ప్రణాళిక
- స్వీపింగ్, డ్రైనేజీలు, పబ్లిక్ టాయిలెట్ల శుభ్రతపై పర్యవేక్షణ
- అంటువ్యాధుల నివారణ, నివారణ కోసం తగిన చర్యలు
- మార్కెట్లు, మటన్, చికెన్ షాపుల శుభ్రతపై పర్యవేక్షణ
- రాష్ట్ర ప్రభుత్వ నిర్దిష్ట మెట్రిక్స్‌తో ఎస్‌యూపీ ప్లాస్టిక్ నిషేధంపై పర్యవేక్షణ
- సాలిడ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్
- హోటళ్లు, సినిమా టాకీసుల శుభ్రతపై పర్యవేక్షణ
- హరితహారం కార్యక్రమాలు, నర్సరీ ప్లాంటేషన్ నిర్వహణ, పార్కులు, పచ్చదనంపై ఫోకస్
- వీధి దీపాల పర్యవేక్షణ
- నీటి సరఫరా పర్యవేక్షణ
- పెన్షన్లు (సామాజిక భద్రతా పథకాలు) పట్టణ పేదరిక నిర్మూలన
- ప్రజల ఫిర్యాదుల పరిష్కారం
- యూఎల్‌బీలో సెక్షన్ అధికారులకు సంబంధించి ఖాళీలు, అవసరాలపై నివేదిక
- ఇంటి పన్నులు, ఇతర పన్నుల రుసుముల వసూలు



కొత్త చట్టాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- విద్యార్థులు, ముఖ్యంగా మహిళలకు అవగాహన కల్పిస్తాం
- కొత్త చట్టాలతో డిజిటల్, జీరో ఎఫ్ఐఆర్‌కు ప్రాధాన్యం పెరుగుతుంది
- సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం.. ఓ బృందాన్ని కూడా ఏర్పాటు చేశాం
- గంజాయి దందాపై ప్రత్యేక టాస్క్‌ఫోర్సు టీంను నియమించాం
- భూకబ్జాలపై ఉక్కుపాదం మోపుతున్నాం
- 'ఆంధ్రజ్యోతి'తో వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా

'కొత్త చట్టాలతో దేశంలో న్యాయవ్యవస్థ, నేర విచారణలో అనేక మార్పులు వచ్చాయి. ప్రజలకు ముఖ్యంగా మహిళల భద్రతకు ఇవి ఎంతో ఉపయోగపడనున్నాయి. అలాంటి కొత్త చట్టాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెకుతున్నాం. విద్యార్థులు ముఖ్యంగా మహిళలకు వీటిపై అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నాం' అని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా తెలిపారు. అలాగే కమిషనరేట్ పరిధిలో జరిగే భూకబ్జాలపై ఉక్కుపాదం మోపుతున్నామని, గంజాయి, డ్రగ్స్ దందా నిర్మూలనకు ప్రత్యేకంగా ఓ టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేస్తున్నామని, రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నామంటున్న ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికిచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు. సమస్యలతో పోలీసుస్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడంతో పాటు ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను బలోపేతం చేసి.. ప్రతీ సమస్యకు తమ పరిధిలో తక్షణ పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నామన్నారు.

వివరాలు : 7 లో..

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

అప్పులబాధతో ఫొటోగ్రాఫర్ ఆత్మహత్య

- తన మృతదేహాన్ని కేఎంసీకీ ఇవ్వాలని సూసైడ్ నోట్
- వరంగల్ రంగశాయిపేటలో విషాదం
- అప్పులిచ్చిన వారి ఒత్తిళ్లే కారణమా?
- మృతుడి డైరీ, సూసైడ్ నోట్ వివరాలున్నాయంటున్న భార్య


రాజు(ఫైల్)

శంభునిపేట, జూలై 4: కుటుంబ అవసరాల కోసం అప్పులు చేసిన ఓ ఫొటో గ్రాఫర్ వాటిని తీర్చే మార్గం కనిపించక, అప్పులోళ్ల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్‌లోని రంగశాయిపేటలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. ఈ ఘటన గురించి పోలీసులు, కుటుంబ సభ్యుల తెలి పిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్‌లోని రంగశాయిపేట చైతన్యనగర్ కాలనీకి చెందిన వనం రాజు (46) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి తండ్రి సారయ్య, భార్య సరిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లి గతంలోనే చనిపోగా, తండ్రి హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో పని చేస్తూ అక్కడే ఉంటున్నాడు. వరంగల్ రంగశాయిపేట చైతన్యనగర్ కాలనీలో నివాసం ఉంటున్న రాజు కుటుంబ అవసరాల కోసం పలువురి వద్ద అప్పులు చేశాడు. తమ వద్ద తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వాలంటూ ఇటీవల అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి ఇంటికి వచ్చిన రాజు వీడియోగ్రఫీ పని ఉందని కంప్యూటర్ ఉన్న గదిలోకి వెళ్లాడు. అయతే గురువారం తెల్లవారుజామున భర్త ఎంతకీ గది తలుపులను తీయకపోవడంతో భార్య సరిత కిటికీ తలుపులు తెరిచి చూడగా భర్త ఉరేసుకుని కనిపించాడు. వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. సంఘటనాస్థలంలో సూసైడ్ నోట్‌తోపాటు, మృతుడి డైరీ, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని.. రాజు భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నారు.

మృతదేహాన్ని కేఎంసీకి ఇవ్వండి..

'ఆర్థిక ఇబ్బందులను జయిస్తామనుకున్నా. వేధింపులను తట్టుకోలేకనే ఆత్మహత్య చేసుకుంటున్న. నేను చనిపోయాక మృతదేహాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి ఇవ్వండి' అని రాజు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. ఆ మేరకు పోస్టుమార్టం అనంతరం రాజు భౌతికకాయాన్ని కేఎంసీకి తరలించనున్నట్టు సమాచారం. ఇదిలా ఉంటే ఉరేసుకున్న తనముఖం చూసిభార్య, పిల్లలు భయపడుతారేమో అని భావించిన రాజు ఉరేసుకునే ముందు ముఖానికి చున్నీ కప్పుకోవడం కలచివేసింది.

వారి ఒత్తిడితోనే ఆత్మహత్య చేసుకున్నాడా?

రాజు ఆత్మహత్య చేసుకోవడానికి అప్పులిచ్చిన వారి ఒత్తిళ్లు, వేధింపులే కారణమా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందుకు రాజు భార్య సరిత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో స్థానికులు కొందరు అధిక వడ్డీల పేరుతో తన భర్తను వేధించారని, బలవంతంగా ప్రామిసరీ నోట్లు రాయించుకున్నారని పేర్కొనడం బలాన్ని చేకూరుస్తోంది. స్థానికంగా ఉండే ఓ వ్యక్తి, అతడి భార్య, కూతురుతో పాటు మరో వ్యక్తి డబ్బుల విషయంలో తన భర్తను రోజూ బెదిరించేవారని, వారు ఇప్పటి వరకు తమ వద్ద నుంచి రూ.10.10లక్షలు తీసుకున్నారని, అప్పు తీరినా, బెదిరించి మరీ అధిక వడ్డీలు వేసి ప్రామిసరీ నోట్‌లు రాయించుకున్నారని ఆరోపిస్తోంది.

వారి వేధింపులు తాళలేకే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని, తన భర్త డైరీ, సూసైడ్ నోట్‌లో అన్ని వివరాలు ఉన్నాయని, తన భర్త చావుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని భోరున విలపించింది.

శాకంబరీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

వరంగల్ కల్చరల్, జూలై 4: భద్రకాళి శాకంబరీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని దేవాదాయ, ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులు, అర్చకులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి ఆలయ ఈవో శేష భారతి, ప్రధానార్చకులు భద్రకాళిశేషు, సూపరింటెండెంట్ విజయ్‌లు ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. శనివారం నుంచి జరిగే ఉత్సవాల ఏర్పాట్ల వివరాలను మంత్రికి వివరించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, ఈ దిశగా సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని ఈవో అర్చకులకు మంత్రి సూచించారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్, దేవాదాయ కమిషనర్ హన్మంతరావులకు ఆహ్వాన పత్రికను అందజేశారు.


మంత్రి సురేఖకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఈవో, అర్చకులు

వరంగల్.. మేధావులకు నిలయం

- ప్రధాన ఎడ్యుకేషన్ హబ్‌గా నగరాన్ని తీర్చిదిద్దుతాం..
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- ఘనంగా ముగిసిన ఎల్బీ కళాశాల స్వర్ణోత్సవాలు



ఎల్బీ కళాశాల స్వర్ణోత్సవాల్లో మాట్లాడుతున్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 4: మేధావులకు ఉమ్మడి వరంగల్ జిల్లా నిలయమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ములుగురోడ్‌లో ఉన్న లాల్ బహదూర్(ఎల్బీ)కళాశాల స్థాపించి 50 యేళ్లు పూర్తయిన సందర్భంగా కళాశాలలో గురువారం స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరై ముందుగా కళాశాలలో ఉన్న లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి పూలమాల వేశారు. అనంతరం కళాశాల ఆడిటోరి యంలో ఏర్పాటు చేసిన స్వర్ణోత్సవ ముగిం పు వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. వరంగల్‌ను రాష్ట్రంలోనే నంబర్‌వన్ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చి దిద్దుతామన్నారు. ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్బీ కళాశాలను స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఎంపిక చేస్తామన్నారు. ఎల్బీ కళాశాల విద్యార్థులకు మంచి బోధన అందిస్తూ 50 యేళ్లు పూర్తి చేసుకుందని, ఇంకో 50 యేళ్ల పాటు ఇదే విధంగా విద్యార్థులకు మంచి బోధన అందించాలని ఆకాంక్షిం చారు. విద్యాశాఖ మంత్రిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారు కాబట్టి విద్యకు కావాల్సిన అన్నిరకాల ప్రోత్సాహం సీఎం అందిస్తారన్నారు. ప్రభుత్వపరంగా రాబోయే కాలంలో ఎల్బీ కళాశాల లాంటి అనేక కళాశాలలు స్థాపించి విద్యార్థులకు మంచి బోధన అందిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రపంచలోనే ధీటుగా నిలబడే విధంగా విద్యార్థులకు కోర్సులను అందిస్తామన్నారు. వరంగల్‌లో నిట్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఎల్బీ కళాశాల లాంటి నాణ్యమైన కళాశాలలు ఉన్నాయన్నారు. విద్యార్థులు మంచి లక్ష్యంతో చదివి ఎదిగి మన జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తారన్నారు. విద్యార్థి నాయకుడిగా రాజేందర్ రెడ్డి అంచెలంచెలుగా ఎదిగి ఎమ్మెల్యే అయ్యారని మంత్రి శ్రీధర్‌బాబు కొనియాడారు.

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎల్బీ కళాశాల ఉద్యమాల గడ్డగా ఎదిగిందని, ఎంతోమంది విద్యార్థి నాయకులను తయారు చేసిందన్నారు. ఈ కళాశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో అన్నిరంగాల్లో ఉన్నారన్నారు. ఎల్బీ కళాశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాశాల నుంచి జాతీయస్థాయిలో పాల్గొన్న క్రీడాకారులకు, అలాగే ఆర్మీ, ఎయిర్ వింగ్ క్యాడెట్స్‌కు సిల్వర్ మెడల్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్బీ కళాశాల చైర్మన్ కె.నిరంజన్, సెక్రెటరీ, కరస్పాండెంట్ ఇ.రాజేందర్ కుమార్, జాయింట్ సెక్రెటరీ రమేష్, ట్రెజరర్ ఆనంద్‌కుమార్ బొల్ల, ఓజీఏ ఎగ్జిబిషన్ సొసైటీ వైస్ చైర్మన్ వనం సత్యేందర్, ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్ రావు, కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, కళాశాల పూర్వ విద్యార్థి అజీజ్‌ఖాన్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బి.ప్రభాకర్, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందంతో పాటు కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

WANTED
WE REQUIRED
WELL EXPERIENCED
WARDENS (MALE)
Salary
Rs.8000/- to 10000/-
Contact :
8008828438 & 8790230740

ఐటీ రంగానికి ప్రభుత్వం పెద్ద పీట
రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
7 లో..

ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు, పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు

- వరద ముంపు నుంచి నగరానికి విముక్తి కల్పిస్తాం
- యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడతాం
- వీలైనంత త్వరగా 2050 మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తాం
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి
- ఈ ఏడాది నుంచే నర్సంపేట మెడికల్ కాలేజీలో తరగతుల నిర్వహణ
- సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలి
- సెప్టెంబరు 9వతేదీలోపు కాళోజీ కళాక్షేత్రం పనులు పూర్తి చేయాలి
- ఉమ్మడి వరంగల్ అభివృద్ధి సమీక్షలో ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

6 లో..

Economy Classified Display COLOUR CLASSIFIED DISPLAY
ఆంధ్రజ్యోతి లో ప్రకటన ఇవ్వండి
- అధిక ప్రచారం పొందండి
బ్లాక్ & వైట్ స్క్వేర్ సెం.మీ.
Rs.170/-
ప్రతి మంగళ వారం & శుక్ర వారం మాత్రమే
కలర్ స్క్వేర్ సెం.మీ.
Rs. 220/-
సింగిల్ మరియు డబుల్ కాలమ్స్ మాత్రమే...
వివరాలకు సంప్రదించగలరు
హన్మకొండ : 9985411677, 9985411676,
వరంగల్ : 9985406150, 9985408173
జనగామ : 9866431354, మహబూబాబాద్ : 9985418040
తొర్రూరు : 9985408003 జయశంకర్ : 9985401232

UNANIMOUS EPIC BLOCKBUSTER

విజయవంతమైన 2వ వారం

తగ్గించబడిన టికెట్ రేట్స్

మల్టిప్లెక్స్: 295/-, 350/-, సింగిల్ స్క్రీన్: 175/-,110/-, 50/-



సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.30,6.00,9.30

Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

తారకరామ 70 - కాచిగూడ 10.45,2.15,5.45,9.15

కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్ (3D) 11.00,2.30,6.00,9.30

మల్లికార్జున 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి

భ్రమరాంబ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి

అర్జున్ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి

తెలుగు 2D

తెలుగు 3D

హిందీ 3D

GLOBAL CINEMAS RELEASE

నేడే బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70ఎంఎం - నారాయణగూడ 11.00,2.00,6.00,9.00

మెగా 70 - దిల్‌సుఖ్ నగర్ 11.00,2.00,6.00,9.00

తాళ్లూరి 70 - ఇసిఐఎల్ 11.00,2.00,6.00,9.00

సంపూర్ణ 70 - వనస్థలిపురం 11.00,2.00,6.00,9.00

రంగ 70 - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00

SKML MOTION PICTURES THROUGH GANESH BHARI 9296509333/929992173

FAMILY ENTERTAINMENT విజయవంతమైన 3వ వారం



శ్రీరామ 70ఎంఎం ఎ/సి - వనపర్తి


భువనేశ్వరి 70ఎంఎం ఎ/సి - ఐజా

పరమేశ్వరి 70ఎంఎం ఎ/సి - కొత్తకోట

PARAM JYOTHI FILMS 9848028739

UNANIMOUS EPIC BLOCKBUSTER

విజయవంతమైన 2వ వారం



వరంగల్ · నిజామాబాద్ · ఆదిలాబాద్ · మహబూబ్‌నగర్ · ఖమ్మం · కరీంనగర్ · నల్గొండ · మెదక్ · రంగారెడ్డి · రాయచూర్

ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఉమ్మడి వరంగల్ అభివృద్ధి సమీక్షలో ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రులు, పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు

వరంగల్, జూలై 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్): ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ సచివాలయంలోని తన కార్యాలయంలో గురువారం ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. 2050 నాటికి జనాభా పెరుగుదలకు అనుగుణంగా వరంగల్ నగర అవసరాలకు సరిపోయేలా మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మాస్టర్ ప్లాన్‌లో ఫార్మా సిటీ, ఐటీ సర్వీసెస్, మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్, ఏకో టూరిజం, ఎడ్యుకేషనల్ సంస్థలు, స్టేడియం, ఎయిర్‌పోర్టు, లాజిస్టిక్స్ పార్కు, టూరిజం, ఖమ్మం-వరంగల్ రహదారిలో, కరీంనగర్- వరంగల్ రహదారిలో డంపింగ్ యార్డుల ఏర్పాటు లాంటి అంశాలు ప్రధానంగా ఉండేలా మాస్టర్ ప్లాన్‌ను వీలైనంత త్వరగా తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌లను త్వరితగతిన తయారు చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు పనులు పూర్తి చేయలేకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. వరంగల్ నగరంలో నిర్మించే రింగ్‌రోడ్డు జాతీయ రహదారులకు కనెక్టివిటీ ఉండేలా చూడాలని కోరారు. అలాగే ఈ ప్రాజెక్టులకు భూసేకరణ యుద్ధప్రతిపాదికన చేపట్టాలని కోరారు. వరంగల్ నగరంలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రాన్ని సెప్టెంబరు 9న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని, ఆలోపు పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నర్సంపేట మెడికల్ కాలేజీలో ఈ ఏడాది నుంచే తరగతులు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని వైద్యా, ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తుని ఆదేశించిన ఆయన వరంగల్ సూపర్‌స్పెషాలిటీ అస్పత్రిని త్వరగా పూర్తి చేయాలని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కాజీపేట, అయోధ్యపురం ఆర్‌ఓబీ నిర్మాణం పనులు ఆలస్యంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏళ్లు గడుస్తున్నా ఇంకా డ్రాయింగ్ల దగ్గరే ఉండటమేంటని అగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ నగరానికి వరద నుంచి విముక్తి కల్పించేందుకు దృష్టి పెట్టామన్నారు. నాలాలు, చెరువులు ఆక్రమణకు గురికావటం వల్లే తరుచుగా వరంగల్ నగరం వరద ముంపునకు గురవుతోందని, ఈ నాలాల ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నాలాలను అక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న వారిని గుర్తించి వారిని తక్షణమే ఇతర ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అయితే మానవతా దృక్పథంతో వ్యవహరించి పేదవారికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. వరద నీరు సాఫీగా వెళ్లడానికి నలాలను విస్తరించాలని, ఇందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బలోపేతం చేయాలని, ఇందుకు అవసరమైన సిబ్బందిని రెవెన్యూశాఖ నుంచి సమకూరుస్తామని మంత్రి తెలిపారు. వర్షాకాలం ప్రారంభమవడంతో ఉమ్మడి వరంగల్‌జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్యులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామీణ పేదలకు ప్రభుత్వం వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వరంగల్ ఎంజీఎంలో గతంకంటే మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు వైద్యాధికారులు దృష్టిపెట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

భూసేకరణ వేగవంతం చేయాలి

ఇన్నర్ రింగ్‌రోడ్, ఔటర్ రింగ్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కోరారు. ఈ రోడ్ల కోసం చేపట్టే భూసేకరణలో ఇళ్లు కోల్పోయినవారికి ఇళ్లు, భూమి కోల్పోయిన వారికి భూమిని అందించే దిశగా కార్యాచరణ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవల్సిన అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే గడువులోపు ఓఆర్ఆర్, ఐఆర్ఆర్ ఫేజ్-1 పనులు పూర్తి చేస్తూనే, ఫేజ్-2 పనులకు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. మాస్టర్ ప్లాన్‌కు ఇబ్బంది రాకుండా ఆర్‌వోబీలు, ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టాలని సురేఖ ఆదేశించారు. వర్షాకాలం కావడంతో నగరంలో వరద సమస్యను రెస్క్యూ టీమ్‌లను సన్నద్ధం చేయాలన్నారు. ఎంజీఎంలో పనిచేసే జూనియర్ డాక్టర్లకు కేటాయించిన హాస్టల్ దుస్థితిపై అధికారులు మంత్రికి వివరించగా, వారి నివాసానికి సాధ్యమైనంత త్వరగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎంజీఎంలో కిడ్నీ వ్యాధిగ్రస్థులకు అందుబాటులో ఉన్న డయాలసిస్ యూనిట్లను మెరుగు పర్చాలని ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. జక్కలొద్దిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకోవాలని, నగరాభివద్ధిని దృష్టిలో పెట్టుకుని కూడా పరిధిని విస్తరించాలని మంత్రి కొండాసురేఖ సూచించారు.

దేవునూరును పర్యాటక కేంద్రంగా చేయాలి

స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలోని దేవూనూరు గుట్టలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. దేవూనూరు ఇనుపరాతి గుట్టల్లో రోప్‌వే, ట్రెక్కింగ్, క్యాంపింగ్ సదుపాయాలు కల్పించాలని కోరారు. ధర్మసాగర్ బండ్‌ను ఆధునికీకరించాలని, రిజర్వాయర్‌లో వాటర్‌స్పోర్ట్స్ ఏర్పాటు చేయాలని కడియం కోరారు. ఈ సమీక్షలో రాష్ట్ర గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కేఆర్.నాగరాజు, ఎమ్మెల్సీలు బండా ప్రకాష్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, ప్రావీణ్య నగర నగర కమిషనర్ అశ్విని తానాజీ వాఖడేతో పాటు పలు శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమీక్షకు దూరంగా ఎమ్మెల్యే, మంత్రులు

ఉమ్మడి వరంగల్ అభివృద్ధిపై జరిగిన సమీక్ష సమావేశానికి పలువురు ప్రజాప్రతినిధులు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. హనుమకొండ జిల్లా పరిధిలో ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ జిల్లా పర్యటనలో ఉన్నారు. ఆయన గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో పర్యటించారు. అలాగే భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడకు చెందిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హనుమకొండ జిల్లాలో వివిధ కార్యాక్రమాల్లో పాల్గొన్నారు. ఈ ఇద్దరు మంత్రులకు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని తాము ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాలు ఉన్నా సమీక్షలో పాల్గొనకపోవటం చర్చనీయాంశంగా మారింది. అలాగే మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన ఉన్న నేపథ్యంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కూడా హైదరాబాద్‌లో జరిగిన సమీక్షకు డుమ్మా కొట్టారు. పాలకుర్తి ఎమ్మెల్యేతో పాటు మహబూబాబాద్, డోర్నకల్ ఎమ్మెల్యేలు కూడా హాజరుకాలేదు. మరో వైపు ఉమ్మడి జిల్లా సమావేశాన్ని వరంగల్‌లో ఐదు రోజుల క్రితమే సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించారని, వారం రోజులు కూడా గడవక ముందే మళ్లీ హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం ఏమిటని కాంగ్రెస్ నేతల్లోనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. కాగా, ఈ సమీక్షకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కొందరు డుమ్మా కొట్టినప్పటికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ముగ్గురు హాజరుకావటం చర్చనీయాంశమైంది.



జయశంకర్ భూపాపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని సంక్షేమ గురుకుల పాఠశాలలో నిరసన చేస్తున్న సిబ్బంది

గురుకులాల్లో టైంటేబుల్‌ను మార్చాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 4: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నూతన టైంటేబుల్‌ను సత్వరమే మార్చాలని గురుకుల సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సంక్షేమ హాస్టళ్ల ముందు గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశాపెట్టిన నూతన టైంటేబుల్‌తో విద్యార్థులకు ఫలితమేమి లేదని, సిబ్బందికి భారంగా మారుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఉపయోకగకరంగా లేని టైంటేబుల్‌ను ప్రభుత్వం పునరాలోచించి మార్చాలని వారు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన నిరసన ప్రదర్శనలో భాగంగా ఉమ్మడి జిల్లాల్లోని గురుకులాల్లో సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

నూతన సబ్‌స్టేషన్లలో నాణ్యత

ప్రమాణాలు పాటించాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ

హనుమకొండ టౌన్, జులై 4: కొత్తగా నిర్మించే సబ్‌స్టేషన్‌లలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి సూచించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి ఐదు జిల్లాల కన్‌స్ట్రక్షన్ డీఈ, ఏడీఈ, ఏఈలతో సీఎండీ గురువారం హనుమకొండ విద్యుత్‌భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. పాత సబ్‌స్టేషన్‌లన్నీ పునరుద్ధరణ చేయాలన్నారు. ప్రతీ సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ సరఫరా ఉండేటట్లు 1600 కిలోమీటర్ల మేర కొత్త లైన్లు ఏర్పాటు చేస్తున్నామని, డిసెంబర్‌లోపు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా లైన్‌లన్నీ పూర్తి చేయాలని సూచించారు. లెంతీలైన్‌ల మధ్య విద్యుత్ సమస్య త్వరతగిన గుర్తించి పరిష్కరించడం కోసం ఫాల్ట్‌ప్యాసేజ్ ఇండికేటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గోదావరి నదీతీరాల్లో కొట్టుకుపోయే లైన్‌ల శాశ్వత పరిష్కారం కోసం షిఫ్టింగ్ చేపడుతున్నమన్నారు. సింగిల్ ఫేజ్ ఉన్న ప్రాంతాల్లో 3 ఫేజ్‌కు మార్చుతున్నామని, వచ్చే 6 నెలల్లో అభివృద్ధి పనులన్నీ పూర్తికావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు సదర్‌లాల్, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు



హనుమకొండ అశోక జంక్షన్ రాస్తారోకోలో విద్యార్థి జేఏసీ నాయకుల ఆందోళన

పేపర్ లీకేజీ మాఫియాకు కొమ్ముకాస్తున్న మోదీ ప్రభుత్వం

విద్యార్థి సంఘాల నాయకుల ఆరోపణ

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 4: పేపర్ లీకేజీ మాఫియా దోపిడీకి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కొమ్ముకాస్తోందని విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు విమర్శించారు. విద్యార్థి సంఘాల జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా గురువారం విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కేయూసీ క్రాస్ రోడ్ నుంచి అశోక జంక్షన్ వరకు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ర్యాలి నిర్వహించారు. ర్యాలీ అనంతరం అశోక జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. దేశంలో 10 యేళ్ల నుంచి ఇప్పటి వరకు 65 పేపర్ లీకేజీలు జరిగాయని విమర్శించారు. లీకేజీలను అరికట్టి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు న్యాయం చేయడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. దేశంలోని పేద వర్గాలకు ఉన్నత, వైద్య విద్యను దూరం చేసే కుట్రలో భాగంగానే నీట్, నెట్ పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. లీకేజీల వల్ల పేద విద్యార్థులు నష్టపోతున్నా మోదీ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లీకేజీలకు మోదీ ప్రభుత్వం బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. లీకేజీపై సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తితో విచారణ జరిపించి దోషులకు కఠిన శిక్షను విధించాలని వారు డిమాండ్ చేశారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ అయిన ప్రాంతాలను గుర్తించి అక్కడ మరోసారి పరీక్షను నిర్వహించి విద్యార్థులకు నాయ్యం చేయాలన్నారు. ఎన్‌టీఏను రద్దు చేసి నీట్, నెట్ పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలన్నారు. లీకేజీ దోషులను గుర్తించి శిక్షించకపోతే విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను ఉధృతంగా చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని ప్రైవేటు విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి భాషబోయిన సంతోష్, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి బి.నర్సింహారావు, ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు రాచకొండ రంజిత్, యూఎస్ఎఫ్ఐ ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి మాలవత్ రాజేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి భాషబోయిన వేణురాజ్, విద్యార్థి జేఏసీ నాయకులు కుమార్, చరణ్, రవితేజ, రాజుగౌడ్, వినయ్, పూర్ణ, మనోజ్, కుమార్, గణేష్, డానియల్, సుతిన్, ప్రణీత్, పవన్, పృథ్విరాజ్, చరణ్, వంశీ, శరత్, రంజిత్, రాజు, రాజేష్, సురేష్ నాయక్, శివ కుమార్ నాయక్, అర్జున్ నాయక్, జశ్వంత్, వికాస్, రూపేష్, సాయి, కిరణ్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట, జూలై 4: కాజీపేట ఐటీఐలో 2024- 25 విద్యా సంవత్సరానికి మిగులు సీట్ల కోసం రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ పద్ధతిలో తగిన సర్టిఫికెట్‌లను అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. 10వ తరగతి మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపాదికన ఎంపిక జరుగు తుందని, ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 4 నుంచి 15వ తేదీలోగా iti.telangana.gov.in దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎన్ని కాలేజీలకైనా, ఎన్ని ట్రేడ్‌లకైనా ఒకటే ఆన్‌లైన్ దరఖాస్తు సరిపోతుందని, మెదటి విడతలో అప్లై చేసిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ఆప్షన్‌లు మాత్రమే సమర్పించాలని తెలిపారు.

హిందీలో కవితకు ఎంఫిల్

కేయూ క్యాంపస్, జూలై 4: హైదరాబాద్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ హిందీ విభాగం పరిశోధకురాలు కవితకు ఎంఫిల్ డిగ్రీ లభించింది. ఈమేరకు గురువారం అంబేద్కర్ ఓపెన్ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ బి.శ్రీనివాస్ కవితకు ఎంఫిల్ ప్రకటించినట్లు వెల్లడించారు. 'మైత్రేయి పుష్పాకే ఉపన్యాసోంమే నారీ చేతన' అనే అంశంపై పరిశోధనకు గ్రంథాన్ని రూపొందించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ హిందీ విభాగం ప్రొఫెసర్ షకీలా ఖానమ్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గోవర్ధగిరి జిల్లా ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్‌గా కవిత విధులు నిర్వహిస్తున్నారు.

దూరవిద్య పీజీ సైన్స్ కోర్సుల ఫీజు గడువు 15

కేయూ క్యాంపస్, జూన్ 28: కేయూ దూరవిద్య కేంద్రం 2024-25 ఏడాదికి సంబంధించిన పీజీ సైన్స్ ద్వితీయ ఏడాది కోర్సుల ఫీజులను జూలై 15 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఇన్విరాల్‌మెంట్ సైన్స్‌లు అందబాటులో ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే క్లాస్‌లను నిర్వహిస్తామని వెల్లడించారు. ఇతర వివరాలకు 0870-2461480, 2461490 నెంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం పేర్కొన్నారు.

కుక్, అసిస్టెంట్ కుక్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 4: హనుమకొండలోని లష్కర్ బజార్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా సంవత్సరం చివరి వరకు కాంట్రాక్టు పద్ధతిలో పని చేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన వారు నేటి నుంచి ఈనెల 11 వరకు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. జిల్లా ఎంపిక కమిటీ ద్వారా ఎంపిక జరుగుతుందని, అనుభవం పనితీరు ఆధారంగా ఎంపిక జరుగుతుందని తెలిపారు.

కొత్తచట్టాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం..

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



- విద్యార్థులు, ముఖ్యంగా మహిళలకు అవగాహన కల్పిస్తాం
- కొత్త చట్టాలతో డిజిటల్, జీరో ఎఫ్ఐఆర్‌కు ప్రాధాన్యం పెరుగుతుంది
- 'ఆంధ్రజ్యోతి'తో వరంగల్ పోలీసుకమిషనర్ అంబర్ కిషోర్‌ఝా

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

దేశంలో ఈనెల ఒకటి నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చట్టాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లతున్నామని, విద్యార్థులు ముఖ్యంగా మహిళలకు ఈ చట్టాలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా పేర్కొన్నారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికిచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు. నగరంలో భూకబ్జాలపై ఉక్కుపాదం మోపటంతో పాటు గంజాయి దందా నిర్మూలనే లక్ష్యంగా ప్రత్యేకంగా బృందాన్ని ఏర్పాటు చేస్తున్నామని, సైబర్ నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను బలోపేతం చేసి.. ప్రజలు ఏ సమస్యతోనైనా నిర్భయంగా పోలీసు స్టేషన్లకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి : కొత్త చట్టాల అమలుపై ఎలా ముందుకెళుతున్నారు?

సీపీ అంబర్ కిషోర్‌ఝా : ఈ నెల 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయి. ఇప్పటికే ఈ చట్టాలపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సుమారు 1,800మందికి పైగా అన్ని విభాగాల్లోని సిబ్బందికి తెలంగాణ పోలీసు అకాడమీలో శిక్షణనిచ్చారు. ఇంకా టెలీ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎదురవుతున్న సమస్యలపై అవగాహన కల్పిస్తున్నారు. పోలీసులతో పాటు ప్రజలకు కూడా ఈ చట్టాలపైన అవగాహన కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ స్థానంలో తీసుకవచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్ (బీఎస్ఏ) చట్టాలపై మహిళలు, విద్యార్థినిలకు అవగాహన కల్పిస్తున్నాం. కళాశాలలు, పాఠశాలలతో పాటు మహిళ సంఘాల్లోని మహిళలకు కూడా అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలు ఏ సమస్య ఉన్న నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు చేసుకోవచ్చు. అలాగే వాట్సాప్ నెంబరు 8712685070లో కూడా తమ ఫిర్యాదులను పంపొచ్చు.

ఆంధ్రజ్యోతి: కొత్త చట్టాలతో ప్రజలకు ఒనగూరే ప్రయోజనాలు?

సీపీ: ఈ కొత్త చట్టాలతో న్యాయవ్యవస్థ, నేర విచారణలో అనేక మార్పులు వచ్చాయి. జీరో ఎఫ్ఆర్ఐ, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయగలిగే అవకాశం, ఎలక్ట్రానిక్ మోడ్‌లో సమన్లను జారీ చేయడం తదితర మార్పులు వచ్చాయి. డిజిటల్ పోలీసింగ్ సిటిజన్ సర్వీసెస్ కింద క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ ద్వారా పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఎఫ్ఐఆర్ నమోదు చేయొచ్చు. అలాగే స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఏ స్టేషన్‌లో అయినా జీరో ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసే అవకాశం ఉంది. అంతేకాకుండా చిన్నారులపై సామూహిక అత్యాచారానికి పాల్పడేవారికి గరిష్ఠంగా మరణ శిక్ష విధించేలా కొత్త చట్టాల్లో నిబంధన ఉంది. మహిళలకు, చిన్నారులపై జరిగే నేరాలకు సంబంధించి కొత్త చట్టంలో ప్రత్యేకంగా సెక్షన్లు పొందపర్చారు. మైనర్లను కొనడం, అమ్మడం కూడా నేరమే. పెళ్లి పేరుతో లైంగిక దోపిడీకి పాల్పడితే గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్ష విధించేందుకు కొత్త చట్టాలు వీలు కల్పిస్తున్నాయి. ఇలా అనేక రకాలుగా ప్రజలకు ముఖ్యంగా మహిళల భద్రతకు ఈ కొత్త చట్టాలు ఉపయోగపడనున్నాయి.

ఆంధ్రజ్యోతి: కమిషనరేట్ పరిధిలో పోలీసుల పనితీరు ఎలా ఉంది?

సీపీ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 45 పోలీస్‌స్టేషన్ల పరిధిలో అధికారులు, సిబ్బంది చాలా అద్భుతంగా పని చేస్తున్నారు. ఉదయం 10.30గంటలకు అన్ని పోలీస్ స్టేషన్లలో ఎస్‌హెచ్‌వోలు విధుల్లో ఉండేలా గైడ్‌లెన్స్ ఇచ్చాం. ఎస్‌హెచ్‌వో ఏదైనా పనిపై బయటకు వెళ్లాల్సి వస్తే, పై అధికారి స్టేషన్‌లో ఉండి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలిస్తున్నారు. ప్రజలకు చేరువ కావటానికి ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తున్నాం. స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఒక్కరి మర్యాదగా మాట్లాడటం, వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించటంతో పాటు వాటిని పరిష్కరించేందుకు దృష్టి పెడుతున్నారు. ఎస్‌హెచ్‌వోల స్థాయిలో సమస్య పరిష్కారం కాకుండా ఏసీపీలు, డీసీపీలను కలుస్తున్నారు. నా వద్దకు కూడా అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. మా పరిధిలో ఉన్న సమస్యలను పోలీసు యంత్రాంగం పరిష్కరిస్తుంది.

ఆంధ్రజ్యోతి: సైబర్ నేరాలను అరికట్టేందేకు తీసుకుంటున్న చర్యలు?

సీపీ: సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇటీవల కాలంలో వరంగల్ కమిషనరేట్ పరిధిలో సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయి. పోలీస్‌శాఖ నుంచి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. గుర్తు తెలియని నెంబర్ల నుంచి అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే ద్వారా అపరిచిత వ్యక్తులు ఎలాంటి వివరాలను ఇవ్వద్దు. ప్రజలు ఇలాంటి మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా లేకపోతే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. రూ.2లక్షలకు పైగా సైబర్ మోసగాళ్లు దోచుకున్నట్లు మాకు ఫిర్యాదులు వస్తే వెంటనే కేసు నమోదు చేసి వాటిని రికవరీ చేస్తున్నాం. ఇటీవల జరిగిన లోక్ అదాలత్ ద్వారా సుమారు రూ.1కోటికి పైగా రికవరీ చేసి బాధితులకు అప్పగించాం. ఇప్పటికే వరంగల్ కమిషనరేట్‌లో సైబర్ క్రైం స్టేషన్‌ను ఏర్పాటు చేశాం. ఒక ఏసీపీతో పాటు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం. ఎప్పటికప్పుడు సైబర్ మోసాలపై వస్తున్న కేసులను పరిష్కరించి బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: డ్రగ్స్ దందా పెరుగుతోంది? నియంత్రణపై దృష్టి పెట్టారా?

సీపీ : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉన్నాం. ప్రధానంగా మాదక ద్రవ్యాల వినియోగంపై దృష్టి పెట్టాం. ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్సును ఏర్పాటు కమిషనరేట్ పరిధిలో నేరగాళ్ల కదిలికలపై దృష్టి పెడుతున్నాం. విద్యాలయాలతో పాటు మార్కెట్లు, నేషనల్ హైవేలు, రద్దీ ప్రాంతాలపై దృష్టి పెట్టాం. చాలా వరకు మత్తు పదార్థాల విక్రయాలను నియంత్రించాం. వివిధ ప్రాంతాల నుంచి గంజాయి దిగుమతి అవుతున్నట్లుగా మా దృష్టికి వచ్చింది. సమాచారం వచ్చిన వెంటనే దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. అయితే ప్రజలు కూడా సహకారాన్ని అందించాలి. గంజాయితో పాటు మత్తు విక్రయాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ప్రజల సహకారంతోనే దేన్నయినా అరికట్టేందుకు ఆస్కారం ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: భూకబ్జాలపై ఫిర్యాదులు పెరు గుతున్నాయి కదా..? వాటిపై మీరు తీసుకుం టున్న చర్యలు ఏమిటీ?

సీపీ: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో భూ కబ్జాలపై ఉక్కుపాదం మోపుతున్నాం. పేద ప్రజలకు పోలీసులు అండగా ఉంటున్నారు. అయితే భూములపై తమ పరిధిలో ఉన్న వాటిపైనే దృష్టి పెడుతున్నాం. తమ పరిధిలో లేని అంశాలను న్యాయం స్థానంకు వెళ్లి పరిష్కరించుకోవాలని సూచిస్తున్నాం. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే కేసుల్లో చాల వరకు భూములపై ఇరుగు పొరుగు మధ్య ఉండే సమస్యలతో పాటు హద్దులపై ఫిర్యాదులు చేసుకుంటున్నారు. అయితే అర్గనైజ్డ్‌గా కబ్జాలు చేయటం.. బెదిరింపులకు పాల్పడి బలవంతంగా భూములను లాక్కోవడం లాంటివి మా దృష్టికి రాలేదు. భూ కబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి.

మహిళా షూటర్‌కు సీపీ అభినందన



ఏఎస్సై సువర్ణను అభినందిస్తున్న సీపీ

వరంగల్ క్రైం, జూలై 4: రాష్ట్ర స్థాయి మహిళా ఓపెన్ షూటింగ్ చాంపియన్ షిప్‌లో బంగారు పతకాన్ని సాధించిన అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్ సువర్ణను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సువర్ణ.. గత నెల 21 నుంచి 28 వరకు హైదరాబాద్ సెంట్రల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మహిళా ఓపెన్ షూటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకాన్ని అందుకుంది. అదేవిధంగా గత నెల 15 నుంచి 20 వరకు తమిళనాడులో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ స్పెషల్ మహిళా షూటింగ్ పోటీల్లో రాష్ట్రం నుంచి పాల్గొని ఐదో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా సువర్ణ గురువారం సీపీ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. సువర్ణను కమిషనర్ అభినందించారు. క్రీడాకారులకు శాఖ పక్షాన ప్రోత్సాహం ఉంటుందన్నారు. సీపీని కలిసిన వారిలో ఆర్ఐ స్పర్జన్‌రాజ్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శోభన్‌గౌడ్ ఉన్నారు.

మాదిగ దండోరా ఆవిర్భావ సదస్సుకు తరలి రండి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్

కాళోజీ జంక్షన్, జూలై 4: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ నెల 7న నిర్వహిస్తున్న మాదిగ దండోరా 30 యేళ్ల ఆవిర్భావ సదస్సుకు తరలి రావాల్సిందిగా ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జిల్లా, నియోజకవర్గాల రథసారథులు ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఆరంభం నుంచి సుదీర్ఘ పోరాటంలో ఏబీసీడీ వర్గీకరణ కోసం పనిచేసిన ఉద్యమ నాయకులంతా సదుస్సులో పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు. సదస్సుకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ అధ్యక్షత వహించనున్నట్లు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మాదిగ కులానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ముఖ్య అతిథులుగా సదస్సులో పాల్గొనన్నుట్లు ఆయన తెలిపారు. సదస్సులో పాల్గొన్న ముఖ్య అతిథులు, విశిష్ట అతిథులు, గౌరవ అతిథులు, రాష్ట్ర జాతీయ ప్రముఖులు, మేధావులు, కవులు, గాయకులను సన్మానించనున్నట్లు తెలిపారు. ఇంకా ఎమ్మార్పీఎస్‌కు చెందిన మాదిగ ఉద్యోగులు, విద్యార్థి నాయకులు, యువ సేన నాయకులను గుర్తించి సదస్సులో మేడి పాపయ్య మాదిగ, మంత్రి రాజనర్సింహ చేతుల మీదుగా సన్మానించనున్నట్లు మోహన్ తెలిపారు. సదస్సులో మాదిగ, మాదిగ ఉపకులాల సంస్కృతిపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా చైర్మన్‌గా సుదర్శన్‌గౌడ్



వరంగల్ మెడికల్, జూలై 4: ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఐఎన్‌టీయూసీ 3194 ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్‌గా బత్తిని సుదర్శన్‌గౌడ్, కన్వీనర్‌గా చాడ బుచ్చిరెడ్డిలను నియమిస్తూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్యాంసుందర్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ బొందుగుల వెంకటేశ్వర్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బత్తిని సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ.. 25 యేళ్లుగా వైద్య, ఆరోగ్యశాఖలోని అన్ని కేడర్స్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ద ఎత్తున సమావేశాలు నిర్వహించి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలను ఆహ్వానించనున్నట్లు తెలిపారు.

బాసర ట్రిపుల్ ఐటీకి సుబేదారి విద్యార్థిని ఎంపిక



కె. నిధి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 4: హనుమకొండ సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పాసైన విద్యార్థిని కె.నిధి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.నెహ్రూ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించిన నిధి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం పాఠశాలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని నిధిని ఉపాధ్యాయ బృందంతో కలిసి ఆయన అభినందించారు.

సంపదల్లో తరగనిది విద్య ఒక్కటే..

'ఆస్కార్' గ్రంథాలయం ప్రారంభోత్సవంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

స్వగ్రామంలో రూ.36లక్షల వ్యయంతో భవనం నిర్మించిన సినీ గేయరచయిత చంద్రబోస్



గ్రంథాలయం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర, పక్కన చంద్రబోస్

చిట్యాల, జూలై 4: సంపదల్లో తరిగిపోనిది విద్య ఒక్కటేనని, యువత గ్రంథాలయాలను వినియోగించుకుని విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు (జీఎస్సార్) పేర్కొన్నారు. చిట్యాల మండలం చల్లగరిగలో సినీగేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత కనుకుంట్ల చంద్రబోస్ తన తల్లి మధునమ్మ జ్ఞాపకార్థం రూ.36లక్షల వ్యయంతో నిర్మించిన 'ఆస్కార్' గ్రంథాలయ భవనాన్ని గురువారం ఆయన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర, అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతమైన చల్లగరిగ గ్రామంలో జన్మించిన చంద్రబోస్ వేలాది సినీ గీతాలు రచించడంతోపాటు ఆస్కార్ అవార్డును కూడా అందుకుని ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. మంచి చేయాలని సంకల్పం ఉంటేనే ఇలాంటి గొప్ప పనులు చేయడం సాధ్యమవుతుందన్నారు. నగరాల స్థాయిలో రూ.36లక్షలు సొంత నిధులతో ఆధునిక హంగులతో భవనాన్ని నిర్మించడం అభినందనయామన్నారు. ఈప్రాంత ప్రజలు, నిరుద్యోగులు ఈ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పొందాలన్నారు. గ్రంథాలయం ప్రహరీ నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేస్తున్నట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే జీఎస్సార్ ప్రకటించారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

నా ఈ స్థాయికి మూలకారణం గ్రంథాలయమే ..

తాను ఈ స్థాయికి చేరుకోవడానికి తన ఊరి గ్రంథాలయంలోని పుస్తకాలను నిత్యం చదవడమేనని ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీగేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ అన్నారు. గతేడాది స్వగ్రామానికి వచ్చినప్పుడు ఇంటిపక్కనే ఉన్న గ్రంథాలయాన్ని చూశానని, తన జీవితానికి ఒక గుర్తింపు తెచ్చిన భవనం శిథిలావస్థలో ఉండడం బాధేసిందని, మరమ్మతు పనులు చేయించే విషయమై తన సతీమణి సుచిత్రతో చర్చించానని గుర్తుచేశారు. కానీ మరమ్మతు పనులు కాకుండా నూతన భవనాన్ని నిర్మిద్దామని ఆమె సలహా ఇవ్వడంతో గ్రామంలో ఏర్పాటు చేసి అభినందన సభలో నూతన భవన నిర్మాణ ప్రకటన చేశానన్నారు. అనుకున్న విధంగా కుటుంబసభ్యులు, గ్రామస్థులు, మిత్రుల సహాయంతో పూర్తిచేయడం సంతోషాన్నిచ్చిందన్నారు. త్వరలోనే అన్ని రకాల సాహిత్య పుస్తకాలతో పాటు ఉద్యోగ అవకాశాలకు ఉపయోగపడే పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ సందర్భంగా సుచిత్ర, చంద్రబోస్ దంపతులను ఎమ్మెల్యే జీఎస్సార్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సన్మానించారు. స్థానిక వాణీ విద్యానికేతన్ విద్యార్థుల నృత్యాలు స్థానికులను అకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలంగాణ పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ ఏపీఎస్ రాజు, గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి తూర్పాటి శ్రీలత, చంద్రబోస్ తండ్రి నరసయ్య, మాజీ ఎంపీపీ దావు వినోదవీరారెడ్డి, ఎంపీవో రామకృష్ణ, సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చంద్రబోస్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఐటీ రంగానికి ప్రభుత్వం పెద్ద పీట

జిల్లాలో ఐటీ రంగాన్ని విస్తృతపరుస్తాం : రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

వడ్డెపల్లి, జూలై 4: ఐటీ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఐటీ రంగాన్ని విస్తృత పరుస్తామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇండస్ట్రీస్, కామర్స్, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గురువారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని ఇందిరానగర్ జంక్షన్ వద్ద రావుల రంజిత్‌కుమార్‌రెడ్డి ఏర్పాటుచేసిన రాక్స్ ఐటీ సొల్యూషన్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన గావించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రావుల రంజిత్‌కుమార్‌రెడ్డి అమెరికాలో స్థిరపడి వ్యాపారం చేస్తూ వరంగల్ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాక్ ఐటీ సొల్యూషన్ సంస్థను ఏర్పాటు చేశారని అన్నారు. ఓరుగల్లు నగరం విద్యాలయాలకు పుట్టినిల్లు అని అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ నిట్ వంటి విద్యా కేంద్రాలు ఉన్నాయని అన్నారు. వరంగల్‌లోని మానవ వనరులు అమెరికా లేదా ఇతర ప్రదేశాలకు వెళ్లకుండా వారి ఇంటి వద్దనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో ఇక్కడే చిన్న, సూక్ష, మధ్యతరహా.. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగానికి పెద్దపీట వేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని శ్రీధర్‌బాబు అన్నారు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ లాంటి నగరాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఈ ప్రాంత వాసులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. వరంగల్ ప్రాంతంలోని మామునూరు విమానాశ్రయం నిర్మాణం పెండింగ్‌లో ఉందని, ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వరంగల్‌లో టెక్స్‌టైల్ పరిశ్రమతో పాటు మరెన్నో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించారని చెప్పారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేస్తామని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ప్రైవేటు రంగంలో కూడా ఉపాధి కల్పన చేస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రాక్స్ ఐటీ సొల్యూషన్ స్థాపకుడు రావుల రంజిత్ రెడ్డితోపాటు రావుల శేషుకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు ఈవీ శ్రీనివాసరావు, బంక సరళ సంపత్ యాదవ్, తేళ్ల సుగుణ కిశోర్, కొండా నాగరాజు, మండల సమ్మయ్య, ఎం.డి. అక్మల్, దన్‌రాజ్, తాళ్లపల్లి రవీందర్, ఎం.డి. ఆరిఫ్, జనగాం శ్రీనివాస్‌గౌడ్, కరాబు రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

దాశరథి శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి

ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



మీడియాతో మాట్లాడుతున్న దేశపతి శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, జూలై 4 : 'నా తెలంగాణ.. కోటి రతనాల వీణ' అని ఎలుగెత్తి చాటి స్వరాష్ట్ర ఉద్యమానికి ప్రేరణనందించిన ప్రముఖకవి దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాశరథి శతజయంతి ఉత్సవాలు ఈనెల 22న ప్రారంభమై సంవత్సర కాలం పాటు ఘనంగా నిర్వహించాలని సాహితివేత్తలు, కవులు, రచయితల సంఘం వారితో చర్చించి, నిర్ణయించినట్లు చెప్పారు. అదేరోజు దాశరథి జన్మస్థలం చిన్నగూడూరు మండలకేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మానుకోట పట్టణంలో శతజయంతి సభను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సభకు ప్రముఖ కవి నందిని సిద్ధారెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్‌తోపాటు ఎంపీ బలరాంనాయక్, మానుకోట, డోర్నకల్ ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, రాంచంద్రునాయక్‌ను ఆహ్వానిస్తున్నామని చెప్పారు.పెద్దసంఖ్యలో హాజరై జయంతి ఉత్సవాలను విజయంతం చేయాలని ఆయన కోరారు.

నిజాం నవాబును ఎదిరించిన కవి దాశరథి..

చిన్నగూడూరు గడ్డ మట్టిలో పుట్టిన దాశరథి కృష్ణమాచార్యులు నాడు నిజాం నవాబును ఎదిరించి, జైలుకు వెళ్లి ఆ గోడలపై ఓ నిజాం పిశాచామా అని రాసిన ధీరుడని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కొనియాడారు. తన కలం ద్వారా అనేక కవితలు రాసి, ప్రజలను చైతన్యవంతులను చేశారని తెలిపారు. అగ్రశ్రేణి కవుల్లో ఆయన ఒకరని అలాంటి మహనీయున్ని స్మరించుకుని వారి చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తెలంగాణ విముక్తి ఉద్యమంలో తనదైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. దాశరథి ఈ ప్రాంతం వారు కావడం తమకు ఎంతో గర్వకారణమన్నారు. దాశరథి శతజ యంతి ఉత్సవ సభకు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు మంగలంపల్లి కన్న, ఎడ్ల వేణు, గుర్రపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకో రూల్.. మాకో రూలా?

బదిలీల మార్గదర్శకాలపై ఉద్యోగుల గుర్రు ● మాకూ మూడేళ్లు సడలింపు ఉండాల్సిందేనని పట్టు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 4: ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ బదిలీలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. ప్రభుత్వం బదిలీలపై విడుదల చేసిన మార్గదర్శకాలపై ఉద్యోగులు గుర్రుగా ఉన్నారు. బదిలీల కోసం ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను ఉద్యోగులకు మింగుడుపడటం లేదు. ఇటీవల కాలంలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల మార్గదర్శకాలకు, ఉద్యోగుల మార్గదర్శకాలు భిన్నంగా ఉండటాన్ని వారు విమర్శిస్తున్నారు. పదవీ విరమణకు మూడేళ్ల సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులను బదిలీల నుంచి మినహాయించిన ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో మాత్రం కేవలం ఒకే ఒక్క సంవత్సరం నిబంధన విధించడం సరికాదనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. గత ప్రభుత్వ కాలంలో జీవో నెం.317తో నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే బదిలీలు చేపట్టడాన్ని సైతం ఉద్యోగులు తప్పుబడుతున్నారు.

మాకూ మూడేళ్లు కావాలి..

మొన్నీమధ్యనే నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో రూపొందించిన మార్గదర్శకాలను ఉద్యోగుల బదిలీలకు వర్తింపజేయాలనే డిమాండ్‌ను ఉద్యోగులు తెర మీదకు తెస్తున్నారు. పదవీ విరమణకు మూడేళ్లకాలం ఉన్న ఉపాధ్యాయులను బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. అలాగే వారికి మూడేళ్ల మినహాయింపును ఇవ్వాలని, ప్రభుత్వం పునరాలోచించి ఉద్యోగుల బదిలీల మార్గదర్శకాలను మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగుల మధ్య ప్రభుత్వం ఇలాంటి తేడాలు సృష్టించడం సరికాదంటున్నారు. అర్హతలను ఉద్యోగులకు సమాన అవకాశాలను కల్పించాలని వారు కోరుతున్నారు. మూడేళ్ల కాలపరిమితితోనే బదిలీలు చేపట్టాలంటున్నారు.

జీవో నెంబరు 317 కథ కంచికేనా...?

గత ప్రభుత్వం జీవో నెంబరు 317తో ఉపాధ్యాయ, ఉద్యోగులను అనైతిక బదిలీలు చేపట్టిందని, నష్టపోయిన వారికి న్యాయం చేయాలనే డిమాండ్ రావడంతో ప్రభుత్వం మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఈ జీవో ద్వారా నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేస్తామని అప్పీల్స్ స్వీకరించిన ప్రభుత్వం వాటిని పరిష్కరించకుండానే బదిలీలు చేపట్టడాన్ని ఉద్యోగులు తప్పుబడుతున్నారు. జీవో నెంబరు 317లో న్యాయం జరుగకుండానే బదిలీలు అయ్యే ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

రైతు భరోసాపై రైతుల సలహా సమీక్ష

గీసుగొండ, జూలై 4: రైతు భరోసాపై రైతుల సలహాలు, సూచనలను తీసుకునేందుకు గీసుగొండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ రడం శ్రీధర్ మాట్లాడుతూ సంఘంలో రూ. 2 లక్షల రుణమాఫీ కోసం అర్హులైన 424 మంది రైతులకు రూ. 4.57కోట్లు చెల్లించాల్సి ఉందని ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్, ఏవో శ్రీధర్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.


తాజా మాజీ ప్రజాప్రతినిధులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

తాజామాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీలకు సన్మానం

సంగెం, జూలై 4: తాజా మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఘనంగా సత్కరించారు. గురువారం హనుమకొండలోని ఆయన స్వగృహంలో పదవీ విరమణ పొందిన సంగెం జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, గీసుకొండ జడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, సంగెం, గీసుకొండ మండలాల పరిధిలోని ఎంపీటీసీలను సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించిన జడ్పీటీసీలు, ఎంపీటీసీలను ప్రజలు రాబోయో రోజుల్లో తగిన విధంగా ఆదరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు, కో ఆప్షన్‌మెంబర్లు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

పోచమ్మమైదాన్, జూలై 4: విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ హకీంనవీద్ అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించి, పోచమ్మమైదాన్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐఎస్‌బీ తలపెట్టిన బంద్ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రోహిత్, ప్రవీణ్, మోహన్, ఫర్హాన్ పాల్గొన్నారు.

● శంభునిపేట: విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) ఆధ్వర్యంలో గురువారం నగరంలో విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. విద్యా రంగ సమస్యల పరిష్కారం కొరకు వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన బంద్ భాగంగా రంగశాయిపేట, శంభునిపేట, మామునూరు ప్రాంతాల్లోని విద్యా సంస్థలను ఏఐఎస్‌బీ నాయకులు బంద్ చేశారు. రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల సమస్యలను పట్టించుకోవటంలో విఫలమయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ రాష్ట్ర నాయకులు హకీమ్ నవీద్, ఉమ్మడి జిల్లా కన్వీనర్ రోహిత్, ప్రవీణ్ మోహన్, ఫర్హాన్ పాల్గొన్నారు.

● గిర్మాజీపేట: నీట్, యూజీసీ నెట్ పరీక్షల లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర దర్యాప్తు చేయించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రద్దు తదితర డిమాండ్లపై జాతీయ స్థాయిలో విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ పిలుపు మేరకు గురువారం వరంగల్ నగరంలో విద్యాసంస్థల బంద్ జరిగింది. ఏఐఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఎన్‌యస్‌యూఐ, ఏఐవైఎఫ్ తదితర సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ పాఠశాలల బంద్ జరిగింది. శ్రీకృష్ణకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బంద్ చేసిన అనంతరం విద్యార్థులు పాఠశాల నుంచి ప్రధాన రహదారి వరకు ర్యాలీ నిర్వహించి మెయిన్ రోడ్డుపై కొద్దిసేపు రాస్తారోకో చేశారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు అశోక్ స్టాలిన్, ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అర్జున్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌లు నీట్, యూజీసీ నెట్ పరీక్షల లీకేజీలపై కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. కార్యక్రమంలో వివిధ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు శివ, సంతోష్, ప్రభాస్, కిరణ్, రఘు, జీవన్, రేవంత్, శశి, రాకేష్, రాజ్ కుమార్, రామ్‌చరణ్ పాల్గొన్నారు.


వరంగల్ హెడ్ పోస్టాఫీస్ వద్ద విద్యార్థుల రాస్తారోకో

భ్రూణ హత్యలను అరికట్టాలి


బేటీ బచావో బేటీ పడావో ప్రతిజ్ఞ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

శంభునిపేట, జూలై 4 : భ్రూణ హత్యలను అరికట్టాలని సామాజిక కార్యకర్త ఈసంపల్లి సుదర్శన్ అన్నారు. రంగశాయిపేట పీహెచ్‌సీలో మానవ అక్రమ రవాణా నిర్మూళనపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బందికి ఆపరేషన్ ముస్కాన్, భ్రూణ హత్యలు, మానవ అక్రమ రవాణా, మహిళల హింస, అత్యాచారాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వేదతో కలిసి సుదర్శన్ మాట్లాడారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీఓ ఎలుగు సుజాత, ఆశాలు, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ పాల్గొన్నారు.

టీశాట్‌లో ఇన్‌స్పైర్‌పై అవగాహన కార్యక్రమం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 4: ఇన్‌స్పైర్‌పై ఈనెల 6న టీశాట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈవో డి.వాసంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విషయ నిపుణులతో కూడిన బృందం టీశాట్ ద్వారా లైవ్‌లో అవగాహన కల్పిస్తారని తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని తప్పకుండా వీక్షించాలని కోరారు.

అంధుల పాఠశాలకు సరుకుల పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న సంఘ సభ్యులు

ఆటోనగర్, జూలై 4: కొత్తవాడలోని బాలుర అంధుల పాఠశాలలో రామన్నపేట ఆర్య వైశ్య సత్ర సంఘం ఆధ్వర్యంలో మాజీ గవర్నర్, మాజీ ముఖ్యమంత్రి కొనిజేటి రోశయ్య జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు, రామన్నపేట ఆర్య వైశ్య సత్ర సంఘం అధ్యక్షులు గట్టు మహేశ్ బాబు మాట్లాడుతూ రోశయ్య సేవలు మరవలేవని, జ్ఞాపకార్థం కొత్తవాడలోని బాలుర అంధ పాఠశాల విద్యార్థులకు ఒక నెలకు సరిపడా సరుకులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట సంపత్‌కుమార్, సంఘ సేవకురాలు అనితారెడ్డి, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పుల్లూరు మధు, కార్యదర్శి సురేశ్, ఆర్యవైశ్య మిత్ర మండలి సభ్యులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య సేవలు చిరస్మరణీయం

● బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

పోచమ్మమైదాన్, జూలై 4: ప్రజల హక్కుల కోసం ప్రాణాలర్పించిన దొడ్డి కొమురయ్య సేవలు చిరస్మరణీయమని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. వరంగల్ పోచమ్మమైదాన్ చౌరస్తాలో గురువారం దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వెంకట్రాములు ముఖ్యఅతిథిగా హాజరై కొంరయ్య చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బుస్సా రవీందర్, ప్రజా సంఘాల నాయకులు ఎమ్డీ కాశీం, దస్రు, సంద్ర కుమార్, మంద ఐలయ్య, మనోహర్, చంద్రశేఖర్, నూతి అంజలి, సరళ, గౌషియాబి తదితరులు పాల్గొన్నారు.

● కరీమాబాద్: దొడ్డి కొమురయ్య ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. డివిజన్‌లోని డీకే నగర్‌లో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కుండే రాజు ఆధ్వర్యంలో కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పూజారి విజయ్, నాయకులు కోరే కృష్ణ, కుందు రాజు, వంగరి సర్వేశ్వర్, తవటం నర్సింహా, కుండె కుమార్, దాసరి రాజు, ఆల్లే సమ్మయ్య, ఠాకూర్, సత్యం, అమీర్, ప్రశాంత్, వరుణ్, చీర కవిత, రమ, విజయ, మహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్‌లో కొమురయ్య వర్ధంతిని నిర్వహించి, కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా, పనాస ప్రసాద్, గుండె భద్రి, ఉమ్డీ యాకూబ్, యాకాంతాచారీ, నామోజు వెంకటాద్రి, బి అనిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


తమ్మెర భవన్‌లో దొడ్డి కొమురయ్యకు నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఉపాధ్యాయులకు సన్మానం

గీసుగొండ, జూలై 4: అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు సమాజంలో ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందని హెచ్‌ఎం ముత్యాలు అన్నారు. వంచనగిరి జెడ్పీ పాఠశాలలో హిందీ పండిట్ రవిందర్, తెలుగు పండిట్ నటరాజు ప్రమోషన్‌లపై బదిలీ కాగా గురువారం ఆత్మీయ వీడ్కోలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రవిందర్ హిందీ టీచర్‌గానే కాకుండా ఎన్‌సీసీ విద్యార్థులకు సేవలు అందించటం అభినందనీయమన్నారు.


రవిందర్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

మాదిగల మహాజాతర సభ కరపత్రం ఆవిష్కరణ

వరంగల్‌సిటీ, జూలై 4: ఎస్సీ వర్గీకరణపై ప్రకాశం జిల్లా ఈదుముడిలో జరిగే మాదిగల మహాజాతర సభ గురువారం కాశిబుగ్గ జంక్షన్‌లో వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుర్రపు శ్యామ్ ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ రాజకీయ పోరాట సమితి, మహాజన పోరాట సమితి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కాశిబుగ్గ జంక్షన్‌లో వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుర్రపు శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కల వెంకటస్వామి హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా మీడియా కమిటీ కన్వీనర్ దాసారపు సారన్న, గద్దల కుమార్, జెర్రిపోతుల విల్సన్, టి.సంపత్, భాస్కర్, రాజు, కరుణాకర్, అశోక్, సుదర్శన్ పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

రైతు బంధును ప్రతీ రైతుకు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

సంగెం, జూలై 4: సాగుచేసే రైతులందరికీ రైతుబంధు ఇవ్వాలని పలువురు రైతులు కోరారు. గురువారం కాపులకనపర్తి రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో రైతుబంధు అవగహన కార్యక్రమం సొసైటీ చైర్మన్ దొమ్మటి సంపత్ అధ్యక్షతన జరిగింది. జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయనుందని, రైతుబంధును రైతులకు ఏ మేర అందించాలన్న దానిపై రైతుల సలహాలను స్వీకరించనుందన్నారు. పదెకరాల లోపు రైతులకు రైతుబంధు అందించాలని రైతులు కోరారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ముడిదే శ్రీనివాస్, డైరక్టర్లు సదిరం చేరాలు, బొమ్మగాని రవీందర్, మందాడి లక్ష్మి, కట్ల పోషాలు, బానోతు కిషన్, పేరాల రాజు, బొమ్మగాని భిక్షపతి, కాలి రాజేందర్, మదూరి కుమారస్వామి, వ్యవసాయాధికారి యాకయ్య, ఏఈవో లావణ్య, సంఘ సీఈవో రమాణాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికురాలికి బ్యాగ్ అప్పగింత

వర్ధన్నపేట, జూలై 4 : ఆర్టీసీ బస్సులో ప్రయాణికురా లు మరిచిపోయిన బ్యాగ్‌ను వర్ధన్నపేట పోలీసులు అప్ప గించిన ఉదంతమిది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జగద్గిరిగుట్ట నుంచి వరంగల్ మీదుగా తొర్రూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో వరంగల్ నగరానికి చెందిన రమ్య అనే ప్రయాణికురాలు జనగామ వద్ద బస్సు ఎక్కింది. వరంగల్‌లో దిగిన రమ్యకు తన బ్యాగ్ కనిపించకపోవడంతో ఆర్టీ సీ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆర్టీసీ అధికారులు వర్ధన్నపేట పోలీసులకు సమాచారాన్ని అందించారు. వర్ధన్నపేట పోలీసులు బస్సును మార్గమధ్యంలో నిలిపివేయించి క్షుణ్ణంగా పరిశీలించగా బస్సు సీటు కింద బ్యాగ్ కనిపించింది. ఈ బ్యాగ్‌లో సెల్‌ఫోన్ తోపాటు కొంత నగదు విలువైన డాక్యుమెంట్లు ఉన్నాయి. దీంతో ప్రయాణికురాలు రమ్యకు బ్యాగ్‌ను వర్ధన్నపేట పోలీసులు అందజేశారు.


ప్రయాణికురాలికి బ్యాగ్‌ను అప్పగిస్తున్న వర్ధన్నపేట పోలీసులు

దొరికిన ఫోన్ పోలీసులకు అప్పగింత


సెల్‌ఫోన్‌ను పోలీసు స్టేషన్‌లో అందజేసిన విద్యార్థులు

వరంగల్ చౌరస్తా, జూలై 4: ఆటోలో ప్రయాణించి మరిచి పోయిన సెల్‌ఫోన్‌ను అదే ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు విద్యార్థులు ఆటోలో దొరికిన సెల్‌ఫోన్‌ను గురువారం ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో సీఐ మచ్చ శివకుమార్‌కు అందజేశారు. నర్సంపేట నుంచి వరంగల్‌కు వస్తున్న నేపథ్యంలో కొమ్మాలలో శకుంతల అనే మహిళ ఆటోలో ఎక్కి వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద దిగింది. ఆటో దిగే క్రమంలో ఫోన్‌ను ఆటోలోనే మరిచిపోయింది. అదే ఆటోలో ప్రయాణిస్తున్న లేబర్ కాలనీకి చెందిన శివ, సాయికృష్ణ అనే విద్యార్థులు ఫోన్‌ను ఆటో డ్రైవర్ రవి కుమార్‌కు చెప్పి పోలీసులకు అందజేశారు.

సేవాలాల్ సేన జిల్లా కన్వీనర్‌గా కిరణ్‌నాయక్


కిరణ్‌నాయక్

వరంగల్‌సిటీ, జూలై 4: సేవాలాల్ సేన వరంగల్ కన్వీనర్‌గా కాశిబుగ్గకు చెందిన బానోతు కిరణ్‌నాయక్ నియమితులయ్యారు. గురువారం హైదరబాద్ సుందరయ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు భూక్యా సంజీవ్‌నాయక్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. కిరణ్‌నాయక్ మాట్లాడుతూ.. సేవాలాల్ సేన ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

హత్య కేసులో పురోగతి?

మట్టెవాడ, జూలై 4: రామన్నపేట బట్టలబజారు రోడ్డులో పూసల వీరభద్రాచారి (52) జూన్ 30 అర్ధరాత్రి హత్యకు గురైన విషయం తెలిసిందే. హత్యకు గల కారణాలు, నిందితుడి కోసం పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారని తెలుస్తోంది. అలాగే రామన్నపేట, బట్టలబజార్, ఎల్లమ్మబజార్, హంటర్‌రోడ్ ప్రాంతాల్లోని సీసీ పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించిన మట్టెవాడ పోలీసులకు కీలక ఆధారం లభించినట్లు తెలిసింది. స్థానికంగా జులాయిగా తిరిగే వ్యక్తి హత్యకు పాల్పడినట్లు పోలీసులు కొన్ని ఆధారాలు దొరికినట్లు తెలిసింది. మద్యం మత్తులోనే ఈ హత్య జరిగినట్లు ప్రాథమికంగా పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. గురువారం రాత్రి అనుమానితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేశారు. ఒకటి రెండు రోజుల్లో హత్య కేసును చేధించనున్నట్లు తెలిసింది.

నాటిన మొక్కలను కాపాడాలి

సంగెం, జూలై 4: వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను పరిరక్షించాలని ఐకేపీ ఏపీఎం కిషన్ సూచించారు. గురువారం కాపులకనపర్తిలో మహిళ సంఘం నాయకురాళ్లతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని ప్రతీ ఒక్కరు వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఇంచార్జి ఏపీవో గణేష్, పంచాయతీ కార్యదర్శి సం దీప్, సీసీలు స్వరూప, సురేష్, వీవో అధ్యక్షురాలు మమత తదితరుల పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కరీమాబాద్, జూలై 4: ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటిచుకుని ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన 33వ డివిజన్ శాంతినగర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం శాంతినగర్‌కు చెందిన సూరం వినయ్ అనే యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్రుంలో పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. మంటలకు తాళలేక బయటికి రావడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. సుమారు 70శాతం కాలినగాయాలతో అపస్మారకస్థితిలో ఉన్న వినయ్‌ను 108 సిబ్బంది చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. కాగా యువకుడి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

బంగారం వ్యాపారి మృతి

మట్టెవాడ, జూలై 4: పిన్నవారివీధికి చెందిన బంగారం వ్యాపారి ఉప్పుల శిరీష్ (55) ఆకస్మిక మృతి చెందాడు. శిరీష్ కుటుంబం గతనెల 29న విహారయాత్రకు వెళ్లింది. అయోధ్య దర్శనం అనంతరం ఈనెల 2న ఆగ్రా వెళ్లారు. మంగళవారం రాత్రి యాత్రకు వెళ్లిన 11 మందిలో ఏడుగురు అనారోగ్యానికి గురవగా, బుధవారం ఉదయం శిరీష్‌కు వాంతులు, విరోచనాలు కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. మిగతా ఆరుగురు కూడా చికిత్స తీసుకుంటుండగా, శిరీష్ పరిస్థితి విషమించి, బుధవారం మృతి చెందాడు. తీర్థయాత్రలో ఫుడ్ పాయిజన్ వల్లే అస్వస్థతకు గురైనట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. శిరీష్ మృతదేహాన్ని గురువారం రాత్రి వరంగల్‌కు తీసుకొచ్చే అవకాశముంది. శిరీష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శిరీష్ సంతాప సూచకంగా శుక్రవారం వరంగల్ నగరంలోని బంగారం దుకాణాలు బంద్ పాటిస్తున్నట్లు వ్యాపారస్తులు తెలిపారు.


మధ్యకోటలో కుడా ఆధ్వర్యంలో వేసిన మొక్కలు



ఖిలావరంగల్ మధ్యకోటలోని ఏకశిల పిల్లలపార్కులో పచ్చదనం

కోటలో పచ్చదనం

ఖిలావరంగల్, జూలై 4: పచ్చదనంతో ఖిలావరంగల్ కోట పరిసరాలు పర్యాటకులను అలరిస్తున్నాయి. హరితవనంలో భాగంగా కోటలో లక్ష మొక్కలను నాటారు. కుడా (కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)ఏవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావ్‌ల ఆధ్వర్యంలో 2020, 2021లో మట్టికోట, మధ్యకోటలోని గుండు చెరువు సమీపంలో మియావాకీ పూలు, పండ్ల మొక్కలు నాటారు. 2021లో మధ్యకోటలోని రైతులకు చెందిన సుమారు 25ఎకరాల భూమిని కుడా అధికారులు కొనుగోలు చేసి, ఏకశిల గుండు చెరువు నుంచి రాతి కోట మీదుగా గుర్రపు శాల నుంచి మళ్లీ గుండు చెరువు వద్ద గల యాదవకాలనీ, ముస్లింకాలనీ వరకు చుట్టూ ప్రహరీ, ఫెన్సింగ్, గ్రిల్ ఏర్పాటు చేశారు. ముందు పెద్ద గేట్‌ను ఏర్పాటు చేశారు. అందులో సుమారు 50,000 మొక్కలను 3 ఇంటు 3 బ్లాక్ ప్లాంటేషన్‌ను ఏర్పాటు చేశారు. పండ్లు, పూలు, కర్రనిచ్చే మొక్కలను నాటారు. ఈ మూడేళ్లలో మట్టికోటతో పాటు, గుండు చెరువు సమీపంలో అలాగే 25 ఎకరాలలో కుడా ఆధ్వర్యంలో సుమారు లక్ష మొక్కలను నాటారు. అందులో జామ, నిమ్మ, నారింజ, దానిమ్మ, సపోట, నేరేడు, మామిడి, పనస, తునికి, విప్ప, సీమచింత, టేకు, కర్జూర, మొక్కలను నాటారు. మూడు సంవత్సరాల క్రితం కోటలో ప్రారంభించిన హరితవనం ప్రస్తుతం 5, 6 ఫీట్ల ఎత్తు పెరిగి పచ్చనిచెట్లతో, చల్లనిగాలి, నీడనిస్తూ పర్యాటకులను ఆహ్లాదపరుస్తున్నాయి.

నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు

నర్సంపేట, జూలై 4: నర్సంపేట వ్యవ సాయ మార్కెట్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం (అగ్రికల్చర్ కో ఆపరేషన్ (ఎం.ఎటి-టి, శాఖ) గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. త్వరలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకం శీర్షికన జూలై 1న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఎమ్మెల్యే మాధవరెడ్డి ఆశీస్సులతో నర్సంపేటకు చెందిన మాజీ మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్‌కే మార్కెట్ చైర్మన్ పదవీ దక్కుతుందని చెప్పింది. 'ఆంధ్రజ్యోతి' చెప్పినట్లుగానే మార్కెట్ చైర్మన్ పీఠం వరించింది. నర్సంపేట మార్కెట్ చైర్మన్‌గా నర్సంపేటకు చెందిన పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా ఖానాపురంనకు చెందిన శాఖమూరి హరిబాబు నియామకమయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్‌తో సహా 18 మందిని మార్కెట్ కమిటీ సభ్యులుగా నియమించారు. బొల్లు రమేశ్, కొల్లూరి మధుకర్, చీర అశోక్, కోరె కుమారస్వామి, హింగె రామారావు, చెలుపూరి జ్యోతి, అజ్మీర దంజ్యానాయక్, డక్క శ్రీనివాస్, యాకూబ్ ఖాన్, గట్టి సారంగపాణి, స్వామిశెట్టి ప్రభాకర్, బందారి దా మోదర్, దుగ్గొండి సొసైటీ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, నర్సంపేట పశు సంవర్ధక శాఖ అధికారి, నర్సంపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనిలను సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



WANTED TEACHERS
★ Wanted Teachers to teach 2nd to 5th All Subjects, 8th to 10th Physical Science & IIT, Fluence in English. Contact : New Koutilya SA High School, Kareemabad, Wgl. Cell : 9393949648
AJW-188168

PLOT FOR SALE
★ KLN Reddy Colony, DCB Bank ప్రక్కన గల 50Ft Road Facingలో 600 Yards. Commercial Plot అమ్మకమునకు గలదు. Genuine Parties Can Contact : 7981257380
AJW-188412

WANTED
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, సిస్టమ్ ఆపరేటర్స్ అర్జంటుగా కావలెను. Salary : 8000 – 11000. సం.ప్ర॥ 9440414616
AJW-188408

నెం.1 నాటుకోళ్ళు పెంచండి
★ నెం.1 నాటుకోడి పిల్లలు, ఫైటర్ అసీల్, అసీల్, టర్కీ, సీమకోడి పిల్లలను పెంచండి. బై బ్యాక్ కలదు. వరంగల్. సం.ప్ర.॥ 9959426718
AJW-186236

WANTED
★ WANTED Immediately ZPHS Ontimamidipally Em H.s Invites the applications for the following Posts S.A-Physical Science, Maths, Social Studies, SGT-2, Computer Operator Cum Accountant. Minimum 5 y" teaching exp Schools Can attend the Interview 08-07-24 in School Premises With Original Certificates. Salary negotiable Head master 9849846102
AJM-11853

CHANGE OF NAME
★ I, SREEVALLI DEVI, spouse of KOMMISETTI SATYANARAYANA, resident of Flat No.21/5, B-Block, Madhu Park Ridge Apartments, Beside Tipu Khan Bridge, I.B.Lines Post Office, Hyderabad-500031, have changed my name from SREEVALLI DEVI to KOMMISETTI VALLI DEVI vide Affidavit dated 18.06.2024 at SIRCILLA, Telangana State.
AJH-13486

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ : నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్.రావు. Cont : 9849145043, 9866584455.
AJW-188140

భద్రకాళి వాటర్ ప్రూఫింగ్
★ వర్షాకాలంలో స్లాబ్, సైడ్ గోడ, వాటర్ ట్యాంక్, బాత్రూమ్, ఓపెన్ టెర్రస్, బాల్కనీ, సీలింగ్ లీకేజ్ సమస్యలను కెమికల్స్ ద్వారా టెక్నికల్ వర్కర్స్‌తో 100% గ్యారంటీతో అరికట్టబడును. ఫోన్ : 7989775119
AJH-002491

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

స్వేరోస్ ఇంటర్నేషనల్ సంస్థకు సదానందం రాజీనామా


సదానందం

నర్సంపేట టౌన్, జూలై 4 : స్వేరోస్ ఇంటర్నేషనల్ సంస్థకు ఆ సంస్థ ఫౌండర్ మెంబర్, సీనియర్ రిసోర్స్‌పర్సన్ చింత సదానందం రాజీనామా చేస్తున్నట్లు గురువారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. గత 12 సంవత్సరాలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో ఎడ్యుకేషన్, హెల్త్, ఎకానమీ విషయాలలో అణగారిన వర్గాల ప్రజలకు అవగాహన కల్పిస్తూ, చైతన్యపరుస్తూ వారిని జ్ఞాన సమాజంవైపు నడిపించేలా కృషిచేశానని పేర్కొన్నారు. 2012లో డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో సంక్షేమ విద్యార్థుల సమ్మేళనంతో ప్రారంభమైన స్వేరోస్ ఇంటర్నేషనల్ సంస్థకు తాను ఒక ఫౌండర్ మెంబర్ కావడం గర్వపడుతున్నానన్నారు. ప్రస్తుతం తన వ్యక్తిగత కుటుంబ సమస్యలు, వ్యక్తిగత పనుల వల్ల సంస్థకు న్యాయం చేయలేకపోతున్నందున సంస్థకు, పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం


నర్సంపేటలో విద్యా సంస్థల బంద్‌లో పాల్గొన్న పలు విద్యార్థి సంఘాల నాయకులు

నర్సంపేట, జూలై 4 : నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలను నిరసిస్తూ, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారథి, ఎస్ ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గుర్రంఅజయ్ అన్నారు. వారు మాట్లా డుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజీ విషయంలో మోదీ సర్కార్ స్పందించడం లేదన్నారు. నీట్ పరీక్షపేపర్ లీకేజీ వల్ల నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు స్టాలిన్, పాలక పవన్, తరుణ్, గొర్రె చందు, కిరణ్, ప్రశాంత్, వినోద్, శ్రీకాంత్, రవీందర్, కృష్ణాకర్ పాల్గొన్నారు. అలాగే యూఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలిచర్ల సందీప్ ఆధ్వర్యంలో ఆ సంఘం విద్యార్థులు విద్యా సంస్థల బంద్‌లో పాల్గొని తెరచి ఉన్న పాఠశాలలను మూసివేయించారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లాల కన్వీనర్ సమ్మెట వర్షన్, రవి, రమేశ్, వెంకటేశ్, రవళి, కృష్ణవేణి, రమ్య పాల్గొన్నారు.

● నెక్కొండ : నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని కోరుతూ మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థలను విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో బంద్ చేయించారు. విద్యార్థులను తరగతి గదుల నుంచి బయటకు పంపించారు. నీట్ పరీక్షాపేపర్ల లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే పదవీకి రాజీనామా చేయాలని సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు బోడ శ్రీకాంత్, మండల అధ్యక్షుడు భూక్య శరత్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి బానోత్ వినోద్‌నాయక్, నాయకులు చల్లా చందురెడ్డి, బానోత్ రవికుమార్, అఖిల్, భాస్కర్, శేఖర్, సునీల్, గణేశ్, వంశీ, నరేశ్, నవీన్, సంతోష్ పాల్గొన్నారు.

● ఖానాపురం : మండల వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ విజయవంతమైనట్లు మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు భూక్య అనిల్ రాథోడ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మోడెం ఎల్లగౌడ్ తెలిపారు. బుధరావుపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీకి కేంద్ర బిందువైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దుచేస్తూ అందుకు బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు పల్స ప్రశాంత్‌గౌడ్, మొలుకల మురళి, నజీర్, శివ, శ్రీనునాయక్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గొండి : నీట్ పరీక్షలు లీకేజీ కారణంగా విద్యార్థి సంఘాలు భారత్ బంద్ పిలుపునివ్వగా మండలంలో విద్యా సంస్థలు బంద్ చేశారు. ఈ సందర్భంగా గిర్నిబావిలో ర్యాలీ చేసిన అనంతరం పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి గుర్రం అజయ్ మాట్లాడుతూ నీట్ పరీక్షలు లీకేజి కారణంగా దేశ వ్యాప్తంగా 24లక్షల మంది జీవితాలతో ఎన్‌టీఏ ఏజెన్సీ చెలగాటం ఆడిందన్నారు. లీకేజి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, నాయకులు రాజేష్, ఉషా, కిరణ్, అఖిల్, ప్రశాంత్, రవి, మహేందర్, శ్యామ్, అనిల్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయలను కల్పించాలని ఏఐఎఫ్‌డీఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి జన్ను రమేష్, అన్నారు. గురువారం మండల కేంద్రంలో నీట్ పరీక్ష పేపర్ అవతకలను విద్యార్థి సంఘాల నాయకులు విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత విద్యను అందించాలన్నారు. ప్రతీ మండలానికి ఎంఈవోలను నియమించాలన్నారు. మోడల్ పాఠశాలల్లో ఆరవ తరగతి నుంచి విద్యార్థులకు హాస్టల్ వసతిని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వంశీ, రాజు, రాకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎర్రబెల్లి జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

వర్ధన్నపేట, జూలై 4 : రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం కేక్ కట్‌చేసి ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రజాజీవితంలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, మునిసిపల్ వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ గుజ్జ గోపాల్‌రావు, నాయకులు సిలువేరు కుమారస్వామి, జన్ను రాములు, గుగులోత్ గోపాల్, పట్టణ ప్రధానకార్యదర్శి కొండేటి శ్రీనివాస్, పొనుగోటి చందర్‌రావు, కొండేటి సంపత్, సిలువేరు రాజు, పిట్టల రాజు, కంజర్ల రవీందర్, తిరుపతి సురేష్, మైనాల శ్యామలరావు, ఎల్లయ్య, మహేష్, వేణు, బుచ్చిబాబు, గబ్బెట బాబు తదితరులు పాల్గొన్నారు.

● రాయపర్తి : రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జన్మదిన వేడుకలు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్, మాజీ ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్‌లు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూస మధు, ఎండీ నయీం, గారె నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వేణు, పాషా, సుధాకర్, రంగయ్య, చందు రామ్ తదితరులు పాల్గొన్నారు.

● పర్వతగిరి : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జన్మదిన వేడుకలను ఆయన స్వగ్రామం పర్వతగిరిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో కేక్ కట్‌చేసి బాణాసంచా కాల్చి పండ్లు పంపిణీ చేశారు.అనంతరం బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు, గ్రామస్థులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏడుదొడ్ల జితేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు, నాయకులు చింతపట్ల సోమేశ్వర్‌రావు, మాడుగుల రాజు, కంటెం ఏకాంతం, గంధం బాలరాజు, గోనె సంపత్, నాగుల బాబు, చింతల శ్రీనివాస్, జంగిలి బాబు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జడ్‌కేఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జగన్‌మోహన్‌రెడ్డి, నర్సయ్యగౌడ్


జగన్‌మోహన్‌రెడ్డి నర్సయ్యగౌడ్

నర్సంపేట, జూలై 4 : నర్సంపేట జోన్ కబడ్డీ అసోసియేషన్ (ఎన్‌జడ్‌కేఏ) అధ్యక్షుడిగా నర్సంపేటకు చెందిన ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, కార్యదర్శిగా నర్సంపేటకు చెందిన గండి నర్సయ్యగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో గురువారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి అబ్దుల్లాఖాన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్, రాంరెడ్డి, కోశాధికారి ముఖర్జీ ,సహాయ కార్యదర్శి మల్లికార్జున్, సాంబమూర్తి పర్యవేక్షణలో ఎన్నికలను నిర్వహించారు. నూతన అధ్యక్షుడు ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ నర్సంపేట ప్రాంతంలో కబడ్డీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్య క్రమంలో డివిజన్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం సభ్యులు సొనబోయిన సారంగపాణి, గూడెపు భిక్షపతి, గుండేటి రవీందర్‌గౌడ్, బానోతు దేవిలాల్, చెన్నబోయిన రామదాసు, కబడ్డీ కోచ్ యాట రవికుమార్ పాల్గొన్నారు.

కోళ్ల ఫారాన్ని పరిశీలించిన డీఎల్పీవో

రాయపర్తి, జూలై 4 : మండలంలోని పన్యానాయక్ తండాలో నిర్మిస్తున్న కోళ్ల ఫారాన్ని గురువారం వరంగల్ డీఎల్పీవో వేదవతి పరిశీలించారు. చిత్తలూరి సంధ్యారాణి కోళ్ల ఫారాన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తూ ఆందోళనలు చేసి ఫిర్యాదులు చేయగా, పంచాయతీ అధికారులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు నిర్మాణాలను పరిశీలించామని, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమగ్ర దర్యాప్తును జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్యా వెంకట్రాం, మాజీ ఎంపీటీసీ భూక్యా క్రాంతి, మాలోతు దేశీరాం, నునావత్ శంకర్, గోపాల్, కమల్‌సింగ్, బాలాజీ, బాలు రమేష్, సంగీత తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకం

చైర్మన్‌గా పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా శాఖమూరి హరిబాబు


శ్రీనివాస్ హరిబాబు

నర్సంపేట, జూలై 4 : వరంగల్‌జిల్లా నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం (అగ్రికల్చర్ కో ఆపరేషన్ (ఎం.ఎటి-టి, శాఖ) గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. త్వరలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకం శీర్షికన జూలై 1న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆశీస్సులతో నర్సంపేటకు చెందిన మాజీ మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్‌కే మార్కెట్ చైర్మన్ పదవీ దక్కుతుందని చెప్పింది. 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పిన విధంగా ఆయననే మార్కెట్ చైర్మన్ పీఠం వరించింది. నర్సంపేట మార్కెట్ చైర్మన్‌గా నర్సంపేటకు చెందిన పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా ఖానాపురంనకు చెందిన శాఖమూరి హరిబాబు నియామకమయ్యారు.

చైర్మన్, వైస్ చైర్మన్‌తో సహా 18 మందిని మార్కెట్ కమిటీ సభ్యులుగా నియమించారు. బొల్లు రమేశ్, కొల్లూరి మధుకర్, చీర అశోక్, కోరె కుమారస్వామి, హింగె రామారావు, చెలుపూరి జ్యోతి, అజ్మీర దంజ్యానాయక్, దక్క శ్రీనివాస్, యాకూబ్‌ఖాన్, గట్టి సారంగపాణి, స్వామిశెట్టి ప్రభాకర్, బండారి దామోదర్, దుగ్గొండి సొసైటీ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, నర్సంపేట పశుసంవర్ధక శాఖ అధికారి, నర్సంపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనిలను సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంచి రోజు చూసుకొని మార్కెట్ కమిటీ సభ్యులు పదవీ బాధ్యతలను స్వీకరించనున్నారు.

మతోన్మాద వ్యతిరేక ఉద్యమాలకు సిద్ధం కావాలి


దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

నర్సంపేట, జూలై 4 : తెలంగాణ సాయుధపోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధంకావాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ పిలుపునిచ్చారు. దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్‌సెంటర్‌లో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, గ్రామాల్లో దొరలు, భూస్వాములు పటేల్, పట్వారి పెత్తందారుల ఆగడాలకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో కడివెండి గ్రామంలో దొర గడి ముట్టడించే కార్యక్రమంలో తుపాకీ తూటా తగిలి మరణించాడన్నారు. పేదల పక్షానపోరాడిన కొమురయ్య స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధంకావాలని కోరారు. కార్యక్రమంలో గడ్డం యాకయ్య ఇల్లందుల సాంబయ్య, గడ్డం నాగరాజు, ఐతయాకూబ్, మహేందర్, హంస మంజుల, అమూల్య. పాలకపవన్, సమ్మక్క, దివ్య తదితరులు పాల్గొన్నారు. నర్సంపేట పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో కొమురయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొరబోయిన కుమారస్వామి మాట్లాడుతూ భూమి కోసం భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి అమరుడైన తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం పార్టీనాయకులు, కార్యకర్తలు పాటుపడాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్, కందికొండ రాజు, కట్టయ్య. పెండ్యాల సారయ్య, సూరయ్య, బబు, బిట్ర స్వప్న, నాగరాణి, యాకలక్ష్మి, విలియంకేరి రాధ పాల్గొన్నారు. సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో దొడ్డి కొంరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి మాస్‌లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి అడ్డూరి రాజు, జవహర్‌లాల్, అడ్డూరి మనోహరచారి, కొమురన్న, దారలింగన్న, రవి, ఇజ్జగిరి కొంరయ్య, సమ్మక్క, సరోజన నివాళులర్పించారు.

● వర్ధన్నపేట : భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమర వీరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను ప్రతీ ఒక్కరు కొనసాగించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి చిర్ర సూరి పిలుపు నిచ్చారు. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో గురువారం వర్ధన్నపేట మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా)నేతలు మైదం పాణి, సాబీర్, మోహన్, సాగర్, సతీష్, శివ, యాకన్న, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

● నెక్కొండ : తెలంగాణ సాయిధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పోరాట చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని సీపీఐ నెక్కొండ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు కోరారు. మండలంలోని పనికరలో సీపీఐ ఆధ్వర్యంలో కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి 78వ వర్ధంతి వేడుకలను జరిపారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటయోధుల చరిత్ర నేటి తరానికి తెలియచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైదం యాకయ్య, శ్రీనివాస్, నర్సయ్య, పాషా, బుచ్చమ్మ, సుగుణమ్మ, కమలమ్మ, సరోజన, కనకమ్మ, భద్రమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికురాలికి బ్యాగ్ అప్పగింత

వర్ధన్నపేట, జూలై 4 : ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు మరిచిపోయిన బ్యాగ్‌ను వర్ధన్నపేట పోలీసులు అప్పగించిన ఉదంతమిది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జగ్గిరి గుట్ట నుంచి వరంగల్ మీదుగా తొర్రూ రుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో వరంగల్ నగరానికి చెందిన రమ్య అనే ప్రయాణికురాలు జనగామ వద్ద బస్సు ఎక్కింది. వరంగల్‌లో దిగిన రమ్యకు తన బ్యాగ్ కనిపించకపోవడంతో ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆర్టీసీ అధికారులు వర్ధన్నపేట పోలీసులకుసమాచారాన్ని అందించారు. వర్ధన్నపేట పోలీసులు బస్సును మార్గమధ్యంలో నిలిపివేయించి క్షుణ్ణంగా పరిశీలించగా బస్సు సీటు కింద బ్యాగ్ కనిపించింది. ఈ బ్యాగ్‌లో సెల్‌ఫోన్‌తోపాటు కొంత నగదు విలువైన డాక్యుమెంట్లు ఉన్నాయి. దీంతో రమ్యకు బ్యాగ్‌ను వర్ధన్నపేట పోలీసులు అందజేశారు.

బీఆర్ఎస్ పార్టీ యూత్ విభాగం నాయకుడి ఆత్మహత్యాయత్నం

వర్ధన్నపేట రూరల్, జూలై 4 : మండలంలోని ల్యాబర్తి గ్రామానికి చెందిన ఉద్యమకారుడు, బీఆర్ఎస్ యూత్ విభాగం నాయకుడు మున్నూరు సోము బుధవారం రాత్రి ఆత్మహత్యాయత్నం చేశాడు. ల్యాబర్తి గ్రామానికి వెళ్తున్న దారిలో ఉండే కొత్తపెల్లి శివారులోని ఎస్సారెస్పీ కెనాలీ వద్ద పురుగులు మందు సేవించినట్లు స్థానికులు తెలిపారు. కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగి, గ్రామస్థులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకుని సోమును వర్ధన్నపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మళ్లీ వరంగల్‌లోని మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రత్యేక అధికారుల బాధ్యతల స్వీకరణ

పర్వతగిరి/వర్ధన్నపేట/చెన్నారావుపేట/దుగ్గొండి, జూలై 4 : ఎంపీపీల పదవీకాలం ముగియడంతో పర్వతగిరి మండల ప్రత్యేక అధికారిగా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. వర్ధన్నపేట మండల ప్రత్యేక అధికారిగా వర్ధన్నపేట వ్యవసాయ శాఖ ఏడీఏ సురేష్‌కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. చెన్నారావుపేట మండల ప్రత్యేక అధికారిగా డాక్టర్ ఎం. బాలకృష్ణ బాధ్యతలను చేపట్టారు. దుగ్గొండి మండల ప్రత్యేక అధికారిగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాసరావు పదవీ బాధ్యతలు స్వీకరించారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

చెన్నారావుపేట, జూలై 4 : వన మహోత్సవంలో భాగంగా ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో గడ్డం దయాకర్ అన్నారు. గురువారం మండలంలోని లింగగిరి గ్రామంలోని పేదరిక నిర్మూలన సంస్థ వారి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్‌రాజు, ఏపీఎం ఈశ్వరయ్య, ఏపీవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

● సంగెం: వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను పరిరక్షించాలని ఐకేపీ ఏపీఎం కిషన్ సూచించారు. కాపులకనపర్తిలో మహిళ సంఘం నాయకురాళ్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇంచార్జి ఏపీవో గణేష్, పంచాయతీ కార్యదర్శి సందీప్, సీసీలు స్వరూప, సురేష్, వీవో అధ్యక్షురాలు మమత పాల్గొన్నారు.

● పర్వతగిరి : వనమహోత్సవం కార్యక్రమంపై గ్రామస్థులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా మండలంలోని కల్లెడలో జరిగిన రంగవల్లుల పోటీలను ఎంపీడీవో శంకర్, ఎంపీవో శ్రీనివాసులు, ఏపీవో సుశీల్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. ఉత్తమంగా నిలిచిన ముగ్గులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మాధవుడు, సిబ్బంది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ఉప్పరపెల్లిలో వన మహోత్సవ వారోత్సవాల్లో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామైఖ్య సంఘాల సహకారంతో మహిళా సంఘాల సభ్యులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీ గోలి కొమురయ్య, కార్యదర్శి దేవేందర్, దాడి భవాని, కట్ట రజిత, అనిత, శ్వేత, మమత, సునిత, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐ జితేందర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి



రాస్తారోకో చేస్తున్న శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, నారక్కపేట గ్రామస్థులు

నల్లబెల్లి, జూలై 4 : అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నానికి కారణమైన సీఐ జితేందర్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, మండలంలోని నారక్కపేట గ్రామస్థులు గురువారం నారక్కపేట జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఆందో ళనకారులు మాట్లాడుతూ వేదింపులకు పాల్పడిన సీఐ, ఇతర సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

వృద్ధుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తీర్మానం

పర్వతగిరి, జూలై 4 : మండలంలోని చింతనెక్కొండలో వృద్ధులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు మహాత్మా జ్యోతిరావుఫూలే విగ్రహ ప్రతిష్ఠాపనకు గురువారం గ్రామీణ హితకారిణి సేవాసంఘం వృద్ధ పౌరుల సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తీర్మానం చేసినట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గటికె మల్లయ్య తెలిపారు. జూలై చివరినాటికి గ్రామంలో ఏర్పాటుకు తీర్మానించామన్నారు. త్వరలోనే నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పల్లెపాటి రాంచందర్‌రావు, దబ్బెట నర్సింహులు, సంకినేని ధర్మారావు, గటికె స్వామి, పుట్ట స్వామి తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

నెక్కొండ, జూలై 4 : ఈ నెల 1వ తేది నుంచి అమలవుతున్న నూతన చట్టాలపై పోలీసు సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్ సూచించారు. గురువారం నెక్కొండ పోలీసు స్టేషన్‌ను ఏసీపీ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పోలీసు స్టేషన్ రికార్డులను, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం నూతనంగా ప్రవేశపెట్టిన చట్టాలను వివరించారు. ఎలాంటి కేసులైనా సత్వర పరిష్కారానికి కృషిచేయాలన్నారు. మండలంలోని రౌడీ షీటర్ల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు, వారిపై నిఘా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది పని తీరు, పోలీసు స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశిలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

పర్వతగిరి, జూలై 4 : రైతుభరోసా పథకంపై మండలంలోని కల్లెడ సొసైటీ పరిధిలో గురువారం రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి మాట్లాడుతూ సమావేశంలో రైతులు వెల్లడించిన అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రశాంత్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కీరు నాయక్, సొసైటీ అధ్యక్షుడు మనోజ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

● గీసుగొండ : రైతుల సలహాలు, సూచనలను తీసుకునేందుకు గీసుగొండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ రడం శ్రీధర్ మాట్లాడుతూ సంఘంలో రూ. 2 లక్షల రుణమాఫీ కోసం అర్హులైన 424మంది రైతులకు రూ.4.57కోట్లు చెల్లించాల్సి ఉందని ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్, ఏవో శ్రీధర్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

● సంగెం : సాగుచేసే రైతులందరికీ రైతుబంధు ఇవ్వాలని పలువురు రైతులు కోరారు. గురువారం కాపులకనపర్తి రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో రైతుబంధు అవగహన కార్యక్రమం సొసైటీ చైర్మన్ దొమ్మటి సంపత్ అధ్యక్షతన జరిగింది. జిల్లా సహకారఅధికారి సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయనుందని, రైతుబంధును రైతులకు ఏ మేర అందించాలన్నదానిపై రైతుల సలహాలను స్వీకరించనుందన్నారు. పదెకరాల లోపు రైతులకు రైతుబంధు అందించాలని రైతులు కోరారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ముడిదే శ్రీనివాస్, డైరెక్టర్లు సదిరం చేరాలు, బొమ్మగాని రవీందర్, మందాడి లక్ష్మి, కట్ల పోషాలు, బానోతు కిషన్, పేరాల రాజు, బొమ్మగాని భిక్షపతి, కాలి రాజేందర్, మదారి కుమారస్వామి, వ్యవసాయాధి కారి యాకయ్య, ఏఈవో లావణ్య, సంఘ సీఈవో రమణాచారి పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద వర్ధంతి

వర్ధన్నపేట, జూలై 4 : స్వామి వివేకానంద 112వ వర్ధంతిని గురువారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త బస్టాండ్ వద్ద గల వివేకానంద విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు సిలువేరు కుమారస్వామి, జన్ను రాములు, పొనుగోటి చందర్‌రావులు మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవితం అందరికీ ఆదర్శణీయమని ఆయన ఆశయాలను కొనసాగిచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైనాల శ్యామలరావు, కొండేటి సంపత్, పిట్టల రాజు, కంజర్ల రవీందర్, మాడిశెట్టి లక్ష్మణ్, తిరుపతి సురేష్, అయిత ఎల్లయ్య, గబ్బెట బాబు పాల్గొన్నారు.

● **మహనీయుల ఆశయాలను కొనసాగించాలి**


వర్ధన్నపేట రూరల్ : మహనీయుల ఆశయాలను కొనసాగించాలని సామాజిక కార్యకర్త మోడెం కుమారస్వామి సూచించారు. గురువారం మండలంలోని ఇల్లంద గ్రామంలో స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అల్లూరి సీతారామరాజు జయంతి, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతి, భూమి కోసం భుక్తి కోసం పోరాడిన దొడ్డి కొమురయ్య వర్ధంతులను ఘనంగా నిర్వహించి వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాయపురపు కుమారస్వామి, నకిరేకంటి రవీందర్, నాంపెల్లి యాకయ్య, కారింగుల శ్రీనివాస్, రవి, రాజు, వెంకటస్వామి, రాజు, నాంపెల్లి వెంకన్న సాయిలు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

నెక్కొండ, జూలై 4 : మండలంలోని అలంకానిపేటలో రైతు నీలం శ్రీనివాస్‌కు చెందిన పాడి గేదె గురువారం సాయంత్రం విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. పంట చేనులో గేదె మేత మేస్తుండగా విద్యుత్ వైరు తగలడంతో మృతి చెందిందని, దీంతో రూ. 80 వేల నష్టం జరిగిందన్నారు. బాధితుడికి విద్యుత్ శాఖ నష్టపరిహారం ఇవ్వాలని గ్రామస్థులు కోరారు.

తాజా మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీలకు సన్మానం

సంగెం, జూలై 4 : తాజా మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఘనంగా సత్కరించారు. గురువారం హనుమకొండలోని ఆయన స్వగృహంలో పదవీవిరమణ పొందిన సంగెం జడ్పీటీసీ గూడ సుదర్శన్ రెడ్డి, గీసుకొండ జడ్పీటీసీ పోలీస్ ధర్మరావు, సంగెం, గీసుకొండ మండలాల పరిధిలోని ఎంపీటీసీలను సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు, కో ఆప్షన్ మెంబర్లు, ఎంపీటీసీ పాల్గొన్నారు.



WANTED TEACHERS

★ Wanted Teachers to teach 2nd to 5th All Subjects, 8th to 10th Physical Science & IIT, Fluence in English. Contact : New Koutilya SA High School, Kareemabad, Wgl. Cell : 9393949848

AJW-188168

WANTED

★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, స్విచ్ ఆపరేటర్స్ అర్జంటుగా కావలెను. Salary : 8000 - 11000. సం.ప్ర. 9440414616

AJW-188408

WANTED

★ WANTED Immediately ZPHS Ontimamidipally Em H.s Inyites the applications for the following Posts S.A-Physical Science, Maths, Social Studies, SGT-2, Computer Operator Cum Accountant. Minimum 5 y" teaching exp Schools Can attend the Interview 08-07-24 in School Premises With Original Certificates. Salary negotiable Head master 9849846102

AJM-11853

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ : నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont : 9849145043, 9866584455.

AJW-186140

PLOT FOR SALE

★ KLN Reddy Colony, DCB Bank ప్రక్కన గల 50Ft Road Facingతో 600 Yards. Commercial Plot అమ్మకమునకు గలదు. Genuine Parties Can Contact : 7981257380

AJW-186412

నెం.1 నాటుకోళ్ళు పెంచండి

★ నెం.1 నాటుకోడి పిల్లలు, ఫైటర్ అసీల్, అసీల్, టర్కీ, సీమకోడి పిల్లలను పెంచండి. బై బ్యాక్ కలదు. వరంగల్. సం.ప్ర.: 9959426718

AJW-188238

CHANGE OF NAME

★ **I, SREEVALLI DEVI, spouse of** KOMMISETTI SATYANARAYANA, resident of Flat No.21/5, B-Block, Madhu Park Ridge Apartments, Beside Tipu Khan Bridge, I.B.Lines Post Office, Hyderabad-500031, have changed my name from SREEVALLI DEVI to **KOMMISETTI VALLI DEVI** vide Affidavit dated 18.06.2024 at SIRCILLA, Telangana State.

AJH-13486

భద్రకాళీ వాటర్ ప్రూఫింగ్

★ వర్షాకాలంలో స్లాబ్, సైడ్ గోడ, వాటర్ ట్యాంక్, బాత్రూమ్, ఓపెన్ టెర్రస్, బాల్కానీ, బిల్డింగ్ లీకేజి సమస్యలను కెమికల్స్ ద్వారా టెక్నికల్ వర్కర్స్‌తో 100% గ్యారంటీతో అరికట్టబడును. ఫోన్ : 7989775119

AJH-002491

ప్రకటనల కొరకు సంప్రదించండి

హన్మకొండ
9985400013
8978510273
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి